

# విజయభాను

విశాఖపట్నం, బుధవారం 05-07-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 293 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అగ్రనేతలిద్దరూ మళ్లీ కలుస్తున్నారు...

### ప్రాధాన్యత సంతరించుకోనున్న జీ-20 సదస్సు



న్యూఢిల్లీ: సరిహద్దుల్లో చైనా రోడ్డు నిర్మాణం విషయంలో బీజింగ్, భారత్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ జీ-20 సదస్సులో ఒకరికొకరు మరోసారి తారసపడనున్నారు. ఈనెల 7న జర్మనీలోని హంబర్గ్‌లో సదస్సు సందర్భంగా అగ్రనేతలిరువురూ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఏ) సదస్సు సందర్భంగా నెలరోజుల క్రితమే కజకిస్థాన్‌లోని ఆస్తానలో ఉభయ నేతలూ సమావేశమయ్యారు. కాగా,

తరువాయి 2లో

## పార్లమెంటులో అల్లూరి విగ్రహం ప్రతిష్టిస్తాం

- ఏడాదిలో విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టే విధంగా చర్యలు
- అల్లూరి స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతోంది

ముఖ్యమంత్రి చంద్రబాబు



విజయవాడ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టేందుకు తెలుగుదేశం పార్టీ అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏడాదిలోనే విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అల్లూరి సీతారామరాజు 120వ జయంతి సందర్భంగా విజయవాడ సత్యనారాయణపురంలోని బుడమేరు వంతెన వద్దనున్న ఆయన విగ్రహానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాహసానికి మారుపేరైన అల్లూరిని తెలుగువారు కలకాలం గుర్తుంచుకుంటారన్నారు. అల్లూరి స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతోందన్నారు.

ఆదివాసీలు మూఢనమ్మకాలను విడనాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తవ్వించిన బోర్ల నీటిని కాకుండా సెలయేటి నీళ్లను తాగడం వల్లనే ఇటీవల ఏజెన్సీలో ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయని అన్నారు.

## పోలీసుశాఖలో బదిలీలు

విజయవాడ : పోలీస్ శాఖలో 4వ తేదీన జరిగిన సమావేశంలో డిఎస్‌పి (సివిల్) లను వారియొక్క రికార్డులను, సర్వీసును పరిగణనలోకి తీసుకొని ప్రమోట్‌చేస్తూ వారికి కేటాయించిన ప్రదేశాలకు బదిలీ చేస్తూ డిజిపి ఎన్ సాంబశివరావు ఉత్తర్వులు జారీచేశారు.

వారి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. కరీంముల్లా షరీఫ్ - డిఎస్‌పి (వెయిటింగ్)ను ఎస్‌డిపిఒగా పెనుకొండ,

2, ఎస్.వి. శ్రీదర్ రావు - డిఎస్‌పి, ఆర్ఎస్ఎఎస్‌టిఎఫ్,తిరుపతి ను ఎస్‌డిపిఒగా గుంతకల్,

తరువాయి 8లో

కార్తి చిదంబరం కేసులో ఈడీకి

## సుప్రీంకోర్టు షాక్



న్యూఢిల్లీ : కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి

వార్త 8లో

ప్రజాస్వామ్యంలో

## ఎవరైనా పోటీ చేయవచ్చు

- కేసీఆర్ మద్దతు కోరిన రామ్‌నాథ్
- కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన వెంకయ్యనాయుడు
- వైకాపా అధినేత జగన్‌తో భేటీ



హైదరాబాద్: అన్ని విధాలా అర్హత ఉన్నందునే రామ్‌నాథ్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించామని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో భాగంగా రామ్‌నాథ్ ఈరోజు హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆయన భేటీ అయి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. వివాద రహితుడు, రచయిత, మంచి వక్త, రాజ్యాంగం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి కాబట్టే రామ్‌నాథ్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించామన్నారు. రామ్‌నాథ్ రాజ్యసభ సభ్యుడిగా రెండుస్లారు పనిచేశారని.. బిహార్ గవర్నర్‌గానూ పనిచేశారని తెలిపారు. రామ్‌నాథ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన కేసీఆర్ కేంద్ర ప్రభుత్వం, భాజపా తరపున కృతజ్ఞతలు తెలిపారు. రామ్‌నాథ్‌కు మెజార్టీ

తరువాయి 2లో

## త్వరలో చెలామణిలోకి రూ.200 నోటు!



దిల్లీ: దేశవ్యాప్తంగా రూ.200 నోటును రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) చెలామణిలోకి తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన అంశంపై జరిగిన కీలక చర్చల్లో పాల్గొన్న ఓ ఉన్నతాధికారి ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే వీటిని ప్రింటింగ్‌కు కూడా ఇచ్చినట్టు తెలిపారు. ఈ నోట్లను తీసుకొచ్చే ఆవశ్యకతపై ఆర్థికమంత్రిత్వ శాఖతో మార్చిలోనే సంప్రదింపులు జరిగాయట. దీనిపై త్వరలోనే ఆర్‌బీఐ నోటిఫికేషన్ జారీచేయనుంది. దేశంలో చిల్లర సమస్యలు తలెత్తకుండా పరిస్థితిని చక్కదిద్దేందుకే రూ.200 నోట్లను చెలామణిలోకి తేవాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

## అల్లూరి యువతకు స్ఫూర్తి

- ఆదర్శ గ్రామంగా పాండ్రంగి

రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు యువతకు స్ఫూర్తినిచ్చి, వారిలో ఉత్తేజాన్ని, చైతన్యాన్ని నింపే వ్యక్తి అని రాష్ట్ర మానవ వనరులశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు అభివర్ణించారు. అల్లూరి 120వ జయంతిని పురస్కరించుకుని పద్మనాభం మండలం పాండ్రంగిలో ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు తొలుత గ్రామ ప్రవేశం వద్ద అల్లూరితో పాటు పలువురు దేశభక్తుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 30 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు కళావేదికను ప్రారంభించి, ఆ వేదికపై నుండి

తరువాయి 2లో

పాత నోట్ల జమకు మరో

## అవకాశమివ్వండి

- సుప్రీంకోర్టు కేంద్రానికి సూచన



దిల్లీ: పాతనోట్లు జమ చేయలేకపోయినందుకు సరైన కారణాలు చెప్పే నిజాయతీపరులకు మరో అవకాశాన్ని కల్పించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి సూచించింది. దీనిపై రెండు వారాలలోగా స్పందన తెలియజేయాలని పేర్కొంది. పాతనోట్ల రద్దుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై

తరువాయి 2లో




### టేకిట్ ఈజీ



రాంగ్ టైమ్‌లో ఇంజనీరింగ్ కాలేజి పెట్టినట్టున్నాం సార్... డొనేషన్ కట్టే విద్యార్థులు కరవైపోయారు !!

## వ్యాధుల నియంత్రణలో ఎస్‌హెచ్‌జిలు భాగస్వామ్యులు కావాలి

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం: సీజనల్ వ్యాధుల నియంత్రణలో స్వయం సహాయక సంఘాల మహిళలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పెందుర్తిలోని జిల్లా సమాఖ్య భవనంలో మండల సమాఖ్య అధికారులు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్లు, వెలుగు ప్రాజెక్టు అధికారులు, మండల ఏపిఎంలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న మూడు మాసాల్లో దోమలు, నీటి ద్వారా సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ, వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, పారా మెడికల్ సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా

తరువాయి 2లో

# నెత్తురు మండే యువతకు ఆరాధ్యుడు 'విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు'



గాజువాక: నెత్తురు మండే యువతకు ఆరాధ్యుడు 'విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజ'ని గాజువాక వైకాపా కన్వీనర్ తిప్పల నాగిరెడ్డి పేర్కోన్నారు. గాజువాక అంబేద్కర్ కాలనీలో భారత స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ అల్లూరి సీతారామరాజు 120వ జయంతి వేడుకలు మంగళవారం వైకాపా నేత మర్డపూడి పరదేశి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. ముందు గా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్బంగా నాగిరెడ్డి మాట్లాడుతూ భారత మాత స్వేచ్ఛకోసం తెల్లవాడి గుండెల్లో ఫిరంగుల మోత మ్రోగించిన సమరయోధుడు అల్లూరి అని కొనియాడారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సిద్దిస్తుందని నమ్మి, దాని కొరకు ప్రాణాలను పణంగా పెట్టిన మహొన్నత వ్యక్తి అని కొనియాడారు. అల్లూరిని ఆదర్శంగా యువత తీసుకోవాలని, ఆయన అడుగు జాడలలో నడవాలని కోరారు. అల్లూరి పేరును విశాఖకు పెట్టాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జగన్నాధం, రాజానారామారావు, ఎన్నేటి రమణ, పిట్టారెడ్డి, చిత్రాడ వెంకటరమణ, అండిబోయిన అప్పారావు, పల్లా పెంటారావు, మదీనా భాషా తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదాల నివారణకు గీతం విద్యార్థుల టెక్నిక్

*ఆటోమేటిక్ సైడ్ స్టాండ్ పై పేటెంట్‌కు దరఖాస్తు*



విశాఖపట్నం : రోడ్డు ప్రమాదాలు ముఖ్యంగా ద్విచక్ర వాహనాలకు సంబంధించి రహదారులపై జరుగు తున్న ప్రమాదాలను తగ్గించడానికి గీతం విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్ధులు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. సైడ్ సేఫ్ పేరిట రూపొందించిన ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని పేటెంట్ కోసం (రిజిష్టర్ నెం. ఎన్‌ఆర్‌డిసి/ఎఫ్‌ఎ/17004/2017) దరఖాస్తు చేసుకున్నారు. సాధారణంగా ద్విచక్ర వాహనాలు నడిపే వారిలో అధిక శాతం మంది స్టాండ్ తీయకుండా ప్రయాణం చేసి ప్రమాదాలు పాలవుతున్నారు. ముఖ్యంగా సరిగా లేని రహదారుల పై అంగ వైకల్యానికి గురవుతున్న వారిలో 30 శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో సైడ్ స్టాండ్ తీయకుండా వేగంగా ప్రయాణించి ప్రమాదంలో చిక్కుకుంటున్నట్లు పలు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ విషయం తెలిసినప్పటికి ద్విచక్ర వాహనాల తయారీ సంస్థలు ప్రత్యామ్నాయాన్ని గుర్తించలేక పోవడంతో ఇంజినీరింగ్ విద్యార్ధులు ఈ అంశాన్ని ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకుని విజయం సాధించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆఖరి సంవత్సరం విద్యార్ధులు ఎ.సాంకేత్, ఎల్.ఆదిత్య, కె.మోనిష్, పి.ఫణికుమార్, సిహెచ్.మణి వెంకటేష్ బృందంగా ఏర్పడి "అటానమస్ సైడ్ కిక్ స్టాండ్ రిట్రైవల్ సిస్టమ్" పేరిట ప్రాజెక్టును పూర్తి చేశారు. దీనిని ఇప్పటికే పలు ఆటోమొబైల్ కంపెనీలకు ప్రదర్శించి చూపించిన విద్యార్ధులు పేటెంట్ హక్కులు పొందడానికి దరఖాస్తు చేసుకున్నారు. త్రీడి ప్రింటింగ్ లో రూపొందించిన సెన్సార్‌లను వాహనం స్టాండ్ దిగువ భాగంలో అమర్చటం ద్వారా పాటు ద్విచక్ర వాహనదారులు సైడ్ స్టాండ్‌ను తీయడం మరచి పోయి ప్రయాణం చేసినట్లయితే వాహనం 8 కిలో మీటర్ల వేగాన్ని అందుకోగానే స్టాండ్ సెన్సార్‌ల ఆధారంతో ఆటోమేటిక్‌గా ముడుచుకు పోతుంది. దీనివల్ల సైడ్ స్టాండ్ తీయని కారణంగా జరిగే రహదారి ప్రమాదాలను నివారించవచ్చునని విద్యార్ధులు వెల్లడించారు. ఈ మొత్తం అమరికకు కేవలం 700 రూపాయలు మాత్రమే వ్యయం అవుతుందని, పెద్ద ఎత్తున ఆర్డర్ లభిస్తే వ్యయం ఇంకా తగ్గే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. పేటెంట్ హక్కులు పొందిన వెంటనే స్టార్టప్ కంపెనీ కింద ఉత్పాదన చేపట్టడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కాగా విద్యార్థుల పరిశోధనాశక్తిని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎమ్.ఆర్.ఎస్.సత్య న్నారాయణ మంగళవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

# ఘనంగా మన్యం వీరుడు అల్లూరి జయంతి



రావులపాలెం : బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు 120 వ జయంతి వేడుకలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హైస్కూలు ప్రాంగణంలో ఘనంగా నిర్వహిం చారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో ఉన్న అల్లూరి కాంశ్య విగ్రహానికి అల్లూరి సీతారామరాజు సేవా సంస్థ అద్యక్ష కార్యద ర్శులు పోతంశెట్టి కనికిరెడ్డి, దుళ్ళ వెంకటేశ్వర్లు, ఉభయ పాఠశాలల చైర్మన్లు నందం వీర వెంకట సత్యనారాయణ, రాయుడు సత్తిరాజు, గ్రామ ప్రముఖులు సఖినేటి వాకులరాజు, మల్లిడి శ్రీనివాసరెడ్డి, పెన్మెత్స సోమరాజు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కనికిరెడ్డి మాట్లాడుతూ అల్లూరి ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయడమొక్కటే ఆయనకు నిజమైన నివాళి అని కొనియాడారు. అల్లూరి పోటీ తత్వం, దేశ భక్తి, పట్టుదల గురించి పలువురు వక్తలు విద్యార్ధుల కు వివరించారు. అనంతరం అల్లూరి జయంతి ని పుస్కరించుకొని వివిధ అంశాలలో ఉభయ పాఠశాలల విద్యార్ధులకు జరిపిన చిత్ర లేఖనం, దేశభక్తి, కబడ్డి పోటీలలో విజేతలకు అల్లూరి సేవా సంస్థ సమకూర్చిన బహుమతు లను ముఖ్య అతిధులు విద్యార్ధులకు అందిం చారు. ఈ సందర్భముగా పాల్గొన్న విద్యార్ధుల కు స్వీట్లు, పెన్నులు పంపిణీ చేసారు. ఈ కార్యక్ర మంలో ఉభయ పాఠశాలల ప్రధానోపాధ్యాయు లు ఎమ్. సుబ్బరాజు, టి. వెంకటరెడ్డి, ఉపాధ్యా యులు, విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కులో ఘనంగా విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకులు



గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అద్వర్యంలో మంగళవారం ఉక్కునగరంలో మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 120వ జయంతి వేడుకులు ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఉక్కు డైరెక్టర్ (కమర్షియల్) పి.రేచౌధురి ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కుల కోసం బ్రీటీష్ వారితో పోరాడిన మహనీయుడు, విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. మన్యం ప్రజల కోసం అల్లూరి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. చిన్నవయసులోనే బ్రీటీష్ వారిని ఏదుర్కోని భారత మాత స్వేఛ్ఛకోసం ప్రాణ త్యాగం చేసిన మహొన్నత వ్యక్తి అని కొనియాడారు. అటువంటి మహపురషుడిని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివిద యూనియన్ నాయకులు మంత్రిరాజశేఖర్, గంధం వెంకటరావు, జి.బోసుబాబు, డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, విల్లా రామ్‌మోహన్ కుమార్, బలిరెడ్డి సత్యన్నారాయణ, బి.మురళి, కె.పరంధామయ్య, తదితరులు పాల్గొన్నారు.



వివోహెల్త్‌కేర్ , ఆసియాలో ప్రముఖ ఆరోగ్య శిక్షణ మరియు విధ్య కంపెని, విశాఖపట్నం వద్ద తన తొలి నైపుణ్యం సెంటర్‌ను ప్రారంభించింది. గ్రాండ్ వేడుక, ఈ వివో నైపుణ్యం సెంటర్‌ను డాక్టర్ ఆర్. శశిప్రభ అబ్స్టెట్రిషియన్ మరియు గైనకాలజిస్ట్ సమక్షంలో మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రథమ ఆసుపత్రి సిబ్బంది, ఆరోగ్యసంరక్షణ మరియు వివిధ విద్యాలయాల నుండి ముఖ్యమైన ప్రముఖులు పాల్గొన్నారు.



## బిహెచ్‌పివి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైభవంగా తొలి ఏకాదశి దర్శనం



గాజువాక: బిహెచ్‌పివి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర ఆలయంలో మంగళవారం తొలి ఏకాదశి దర్శనం వేడుకలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలను, పుష్పార్చనలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి, స్వామివారి దర్శనానికి సీటీ భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు జి.ప్రేమకుమారి, భాజపా నగర ప్రధాన కార్యదర్శి వి.దక్షిణామూర్తిలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ప్రేమ కుమారి మాట్లాడుతూ తొలి ఏకాదశినాడు స్వామివారిని దర్శించుకుంటే అనేక శుభఫలితాలు సిద్ధిస్తాయని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## అగ్రనేతలిద్దరూ మళ్లీ కలుస్తున్నారు...

హంబర్గ్‌లో జరిగే జీ-20 సదస్సు సందర్భంగా బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు లాంఛనపర్వకంగా సమావేశమై చర్చలు జరుపుతారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో చైనా, భారత్ నేతల సమావేశానికి ఎక్కువ ప్రాధాన్యం ఉందని వీరంటున్నారు. సరిహద్దులపై భారత-చైనా మధ్య మాటల యుద్ధం దాదాపు నెలరోజులుగా ముదురుతోంది. సిక్కిం సరిహద్దుల్లోని డోకా లా ప్రాంతం తమదేనని, తాము చేపట్టే రోడ్డు నిర్మాణానికి భారత్ అడ్డుపడటం తమ సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడమేనని చైనా భారత్‌పై విరుచుకుపడుతుండగా, డోకా లా భూటాన్‌లోని వస్తుందని, అక్కడ రోడ్డు నిర్మించడమంటే యథాతథ స్థితిని దెబ్బతీయడమేనని భారత్ బలంగా వాదిస్తోంది. భూటాన్ భద్రతతో తమ దేశ భద్రతా ముడిపడి ఉందని నొక్కిచెబుతోంది.

## ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేయవచ్చు

ఉందని తెలిసినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టిందని... ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేసే హక్కు ఉందన్నారు.

**తెరాస తొలినుంచీ మద్దతిచ్చింది**

రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే తన పేరును ప్రకటించినప్పటి నుంచి తెరాస మద్దతు పలుకుతూ వచ్చిందని ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ జలవిహార్‌లో తెరాస నేతలతో రామ్‌నాథ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌కు రెండు విధాలుగా కృతజ్ఞతలు చెబుతున్నారు. ఒకటి దారి పొడవునా తనకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసినందుకు.. రెండోది హిందీ మాట్లాడే వ్యక్తిని కాబట్టి హిందీలోనే ప్రసంగించినందుకు. నేను బిహార్ గవర్నర్‌గా ఏ పార్టీతోనూ సంబంధం లేకుండా బాధ్యతలు నిర్వర్తించా.. రాష్ట్రపతిగానూ అదేవిధంగా బాధ్యతలు నిర్వర్తిస్తా. రాజ్యాంగబద్ధ పదవులు స్వీకరించినప్పు డు వాటికి న్యాయం చేయాలి. అని అన్నారు.

**వైకాపా నేతలతో సమావేశం**

భాజాపా నేతలతో భేటీ అనంతరం రామ్‌నాథ్ కోవింద్ పార్క్ హయత్ హోటల్‌లో వైకాపా అధినేత జగన్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో జగన్‌తో పాటు ఎంపీలు విజయసాయిరెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైకాపా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రామ్‌నాథ్ కోవింద్‌ను జగన్ శాలువా కప్పి సత్కరించారు. పార్టీ ఎమ్మెల్యేలను జగన్ స్వయంగా రామ్‌నాథ్‌కు పరిచయం చేశారు. రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి జగన్ ఇప్పటికే తన మద్దతు రామ్‌నాథ్‌కు ప్రకటిచిన సంగతి తెలిసిందే.

## మరో అవకాశమివ్వండి

జరిగింది. ఈ సందర్భంగా కేంద్రానికి, ఆర్బీఐకి సర్వోన్నత న్యాయస్థానం పలు ఆదేశాలు జారీ చేసింది. పాత రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తూ.. గతేడాది నవంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. 2016 డిసెంబర్ 30లోగా పాతనోట్లను బ్యాంకుల్లో జమచేసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇంకా కొందరు వ్యక్తులు పాతనోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోలేకపోయారు. తమకు మరో అవకాశం కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ వేశారు. దీనిపై నేడు న్యాయస్థానం విచారణ చేపట్టింది. సరైన కారణాలతో డబ్బు జమచేయలేకపోయిన నిజాయతీపరులకు మరో అవకాశాన్ని కల్పించాలని సూచించింది. ఉదాహరణకు కేంద్రం చెప్పిన గడువు సమయంలో ఓ వ్యక్తి జైల్లో ఉంటేగనుక, ఆ వ్యక్తికి ఇప్పుడు అవకాశం ఇవ్వకపోవడం సరికాదని పేర్కొంది. ఇలాంటి వ్యక్తులకు ఎలా సాయపడతారు. వీరి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలియజేయాలని ఆదేశించింది. సుప్రీం నిర్ణయంపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం దీనిపై సమగ్ర నివేదికతో అఫిడవిట్ దాఖలు చేస్తామని కోర్టుకు చెప్పింది. ఈ కేసులో తదుపరి విచారణను న్యాయస్థానం జులై 18కి వాయిదా వేసింది.

## అల్లూరి యువతకు స్ఫూర్తి





ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జయంతిని 2015 నుండి రాష్ట్ర పండుగగా జరపాలని ప్రకటించిందని, అప్పటినుండి పాండ్రంగిలో అల్లూరి జయంతిని గ్రామస్తులంతాఒక ఉత్సవంలా జరుపుకోవడం ఆనందంగా వుందన్నారు. అల్లూరి సీతారామరాజు నివసించిన గృహాన్ని మ్యూజియంగా తీర్చిదిద్దుతామని, గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చుతామని అన్నారు. కేంద్ర రైల్వే మంత్రి సురేష్ ప్రభు దత్తత గ్రామమైనందున గ్రామాభివృద్ధికి అందరితో చర్చించి ప్రణాళికలను తయారుచేస్తామని, త్వరలో గ్రామ రూపురేఖలు మారుస్తామని అన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామం వద్ద వంతెనను నిర్మిస్తామని, పద్మనాభం ఘాట్‌రోడ్ పనులను కూడా త్వరలోనే చేపట్టడం జరుగుతుందని అన్నారు. పాఠశాల అభివృద్ధికి 15 లక్షలు, చెరువు పనులకు 50లక్షల రూపాయలు మంజూరు చేసి, పాండ్రంగిని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన వీరుని జన్మస్థలం అభివృద్ధి చెందితే భావితరాల వారికి అల్లూరి గొప్పతనం గుర్తుండిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి అప్పలనాయుడు సభాధ్యక్షత వహించారు.

పద్మనాభం కేజిబివి పాఠశాల విద్యార్థి హేమలత ఐఐటి నందు సీటు సాధించినందున మంత్రి ఆమెను అభినందించారు. ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడలలో గెలుపొందినవారికి మెమోంటోలను అందజేశారు. అనంతరం అల్లూరి జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డివో వెంకటేశ్వరరావు, భీమిలి ఇన్‌ఛార్జి అధికారి శ్రీనివాస్, నాగమణి, పిఓ శివప్రసాద్, తహశీల్దారు, ఎంపీడీవో, పద్మనాభం, ఆనందపురం, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పాండ్రంగి సర్పంచి, ఉత్సవ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**వ్యాధుల నియంత్రణలో ఎస్‌హెచ్‌జిలు భాగస్వామ్యులు కావాలి**

వుంటూ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నారన్నారు. అయితే ఆయాశాఖలు తీసుకుంటున్న చర్యలకు తోడు జిల్లాలోనున్న సుమారు ఐదులక్షల ఎస్‌హెచ్‌జిల మహిళలు సహకరిస్తే ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా, మరణాలు సంభవించకుండా ఉంటాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. దోమలు, నీటిద్వారా ప్రబలే సీజనల్ వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఎస్‌హెచ్‌జి మహిళలు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వుంటాయన్నారు.జిల్లాలోని 925 గ్రామ పంచాయితీల్లో ఏర్పాటు చేసిన, చేస్తున్న కంపోస్టు యార్డులు సక్రమంగా వినియోగిస్తున్నదీ, లేనిదీ పరిశీలిస్తూ వాటిని సద్వినియోగం చేసుకొనేలా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఉపాధిహామీ పనుల కన్వర్జన్సులో భాగంగా ప్రతి గ్రామంలోనూ ఒక కిలో మీటరు మేర చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్ పనులలో ఎస్‌హెచ్‌జి మహిళలను భాగస్వామ్యులను చేస్తూ ఈనెల 15 కల్లా పూర్తి చేయాలని ఉద్యానవనశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు సత్యసాయి శ్రీనివాస్, కల్యాణ చక్రవర్తి, ఉద్యానవనశాఖ అధికారులు, మండల సమాఖ్య అధికారులు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్లు, వెలుగు ప్రాజెక్టు అధికారులు, మండల ఏపిఎం ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## చారిత్రాత్మకమైన నిర్ణయం

చాలా ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న వస్తుసేవల పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్-జీఎస్టీ) జూలై నెల ఆరంభం నుంచి దేశంలో అమలులోకి వచ్చింది. దీంతో ఈ ఉపఖండంలో ఆర్థికాభివృద్ధి పుంజుకొని స్థూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని ఆశించవచ్చు. స్వాతంత్ర్యం తర్వాత అతి పెద్ద పన్ను సంస్కరణగా దీన్ని భావించవచ్చు. జీఎస్టీతో దేశంలో ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చి అటు రాష్ట్రాలు, దేశం కూడా ఆర్థికంగా లాభపడుతాయి.

జీఎస్టీతో ఎలా, ఏం లాభమంటే.. మార్కెట్ ఆర్థికవేత్తలు ఆడమ్ స్మిత్, రికార్డో చెప్పిన విధంగా నియంత్రణలేని వ్యాపారమే దేశాన్ని ఐశ్వర్యవంతం చేస్తుంది. స్వేచ్ఛాయుత వ్యాపార విధానం ఎంత విస్తృతంగా ఆచరణలో ఉంటే అంతగా ఆ సమాజం ఆర్థికాభివృద్ధి చెందుతుందని వారు ఏనాడో సెలవిచ్చారు. ఇన్నాళ్లకు వారి బాటలో నడుస్తున్నాం. దేశమంతా ఏకరితి పన్ను విధానంతో స్వేచ్ఛాయుత వ్యాపారానికి జీఎస్టీతో మార్గం సుగమమై దేశాభివృద్ధి గతం కన్నా వేగంగా పరుగులు తీస్తుంది. భారతీయుల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలంటే జీఎస్టీతోనే సాధ్యం. జీఎస్టీ విధానం తీసుకురావాలన్న 17 ఏళ్ల తర్వాత ఈ జూలై మధ్య రాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పటిదాకా పరోక్ష పన్నుల విధానంతో ఎన్నో అవాంతరాలు ఎదుర్కొన్నాం. జీఎస్టీతో ఇక అలాంటి అవాంతరాలేవీ ఉండవు. కోట్లాది మంది వ్యాపారస్తులు, వేలకోట్ల ఆర్థిక వ్యవస్థ అంతా ఒకే మార్కెట్‌గా అవతరించింది. జీఎస్టీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న డజన్‌కు పైగా వివిధరకాల పన్నులు పోయి ఒకే పన్ను ఉంటుంది. దేశమంతా ఒకే రీతిగా అమలులోకి వస్తుంది. దీంతో ఆసియాలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా దేశం అవతరిస్తుంది. గాంధీ.. స్థానిక ఉత్పత్తి వినియోగం ద్వారానే ప్రజలు ఆర్థికాభివృద్ధి, స్వావలంబన సాధిస్తారని భావించాడు. ఈ భావన పునాదిపైన చెప్పిందే రాట్నం పై చేతితో నూలు వడకటం. దీంతో పెద్ద స్థాయిలో ఉత్పత్తి పెంచటానికీ, పరిశ్రమల స్థాపనకు దూరంగా ఉన్నది. ఇది ఒకరకంగా ఆలోచిస్తే, ఆధ్యాత్మిక ఆలోచనలకు దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తుంది. కాబట్టి ఉత్పత్తి పెరుగటానికి, సంపద పెరుగ టానికి గాంధీ ఆలోచనా విధానం అనుగుణంగా లేదు. దీంతో పేదరికం ఒక అనివార్య స్థితిలో భాగంగానే ఉండిపోయింది. అ క్రమంలోనే వ్యవసాయోత్పత్తి కూడా అలాగే ఉండిపోయి వ్యవసాయోత్పత్తులు అవసరాలకు అనుగుణంగా పెరుగక పోవటంతో కరువు కాటకాలు తాండవించాయి. ఆధ్యాత్మిక ఆలోచన, ఆచరణ దేశ ప్రజలను ఆకలిచావుల నుంచి దూరం చేయలేక పోయిందన్నది చారిత్రక వాస్తవం.

ఆడమ్ స్మిత్ చెప్పినట్లు, రికార్డో మెరుగులు దిద్దినట్లు.. శ్రమ విభజన, విభజిత ప్రత్యేక నైపుణ్యాలతోనే సంపద సృష్టించబడుతుంది. ఈ విధమైన వ్యాపార వ్యవస్థతోనే ఉత్పత్తి కూడా పెరిగి సంపద పంచబడుతుంది. పేదరికం దూరమవుతుంది. ఎంతగా పని విభజన జరిగి ప్రత్యేక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయో అంతగా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. ప్రజలు ధనవంతులవుతారు. జీఎస్టీ అమలులోకి రానంతకాలం స్వేచ్ఛా మార్కెట్‌కు అనేక అవరోధాలున్నాయి. రాష్ట్రాల సరిహద్దులే మార్కెట్‌కు ఆటంకాలుగా మారి స్వేచ్ఛా మార్కెట్ రూపొం దలేదు. మార్కెట్ మొత్తం చిన్నచిన్న సరిహద్దుల్లోపల కునారిల్లిపోయి ఆర్థిక వ్యవస్థ కుంటుపడిపోయింది. ప్రజలు, దేశం పేద దేశంగా మిగిలిపోయింది. ఈ నేపథ్యంలోనే.. జూన్ 30 మధ్య రాత్రి పార్లమెంట్ సెం ట్రల్ హాల్లో జీఎస్టీ బిల్లు చట్ట రూపం ధరించి అమల్లోకి వచ్చింది. దీనికి దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నేతలు, అమితాబ్ బచ్చన్, రతన్ టాటా లాంటి ప్రముఖుల సమక్షంలో జీఎస్టీ ప్రాణం పోసుకున్నది. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో గతంలో 1997లో మధ్యరాత్రి ఒక ఉత్స వం జరిగింది. అది దేశ స్వాతంత్ర్య గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. తర్వాత మళ్లీ ఇప్పుడే అంతటి ప్రాధాన్యమున్న జీఎస్టీ ప్రారంభోత్సవం చోటు చేసుకున్నది. ఇంతటి ప్రాధాన్యమున్న జీఎస్టీతో దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుంది.

జీఎస్టీని ఆలస్యంగానైనా అమల్లోకి తెచ్చుకోవటం మన దేశాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. ఈ సందర్భంగానే ఐఎంఎఫ్ అభిప్రాయం పరిగణించదగింది. ప్రభుత్వం ప్రధానమైన చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నది. దీంతో దేశం సుస్థిరాభివృద్ధి చెందుతుంది అని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ టావో ఝూంగ్ అన్నారు. అలాగే.. జీఎస్టీ ప్రారంభంతో దేశాభివృద్ధి పుంజుకొని 8 పైగా వృద్ధిరేటు దాటుతుంది. దేశ వ్యాప్తంగా జీఎస్టీ అమలుతో ఉత్పత్తిలో గుణాత్మక మార్పు వచ్చి ఉత్పత్తి పెరుగుతుందని కూడా ఐఎంఎఫ్ తెలిపింది.

## తెలుగు జాతి గర్వించదగ్గ యోధులు అల్లూరి

### నగర కాంగ్రెస్ కార్యదర్శి కె.గోపాల్‌రెడ్డి



విశాఖపట్నం : తెలుగు జాతి గర్వించదగ్గ యోధులు అల్లూరి అని నగర కాంగ్రెస్ కార్యదర్శి కె.గోపాల్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా 31వ వార్డు రైల్వే న్యూకోలని బాలికల ఉన్నత పాఠశాల, జీవీఎంసీ బాలల ఉన్నత పాఠశాల విధ్యార్థిని, విధ్యార్థులకు సోమవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు మంగళవారం ఉదయం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కార్యదర్శి కె.గోపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చిన్ననాటి నుండే ఆంగ్లేయుల పాలనను వ్యతిరేకించి ప్రజల హృదయాలలో చిరస్మరణీయులుగా నిలిచి పోయారని అన్నారు. అటువంటి మహాయోధుడు తెలుగు వాడైనందుకు గర్వించదగ్గ విషయమని అన్నారు. నేటి తరంవారు అల్లూరి సీతారామరాజు కోసం తెలుసు కోవాలని అదే సందర్భంలో...

విద్యార్థుల నైపుణ్యం పెంపొం దించాలని అల్లూరి సీతారామరాజు జివిత చరిత్ర పై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని చేప్పారు.

ఈ సందర్భంగా మొదటి విజేత బాలికలు చాందిని, ద్వితీయ దివ్వ, తృతీయ కల్పన, బాలల మొదటి విజేత చాణుక్య, ద్వితీయ మణికంఠ, తృతీయ ప్రదీప్‌లు విజేతలుగా గెలుపొందగా పోటీలలో పాల్గొన్న 19 మందికి బహుమతులును గోపాల్‌రెడ్డి అందజేశారు.


కార్య క్రమంలో ఉపాధ్యాయులు బి.వెంకటరమణ మూర్తి, గాయత్రి, స్వర్ణకుమారి, విరోనిక రాజ్యలక్ష్మి, దనుం జయరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధనలక్ష్మి చావుకి కారకులైన వారందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలి



అచ్యుతాపురం: తమ కుమార్తె చావుకి కారణమైన వారందరినీ తక్షణమే అరెస్టు చేయాలని మృతు రాలు (ధనలక్ష్మి) కుటుంబ సభ్యులు, చుట్టు ప్రక్కల వారితో కలిసి మంగళవారం తాహశీల్దారు కార్యాలయం, పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించి వినతి పత్రం అందజేసారు. గత నెలలో పూడిమడక శివారు కడపాలెం గ్రామంలో వరకట్నం తీసుకురాలేదని మైలపల్లి దనలక్ష్మిని హింసించి, చిత్ర హింసలకు గురిచేసి, దుర్మార్గంగా హత్యచేసారని మృతురాలు తల్లి ఆరోపణతో మృతురాలి అత్త ఉమ్మిడి దొడ్డమ్మను ఒక్కరినే అరెస్ట్ చేసారని మిగిలిన వారిని కూడా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు. అయితే మృతురాలు తల్లి తన కూతురు చావుకు ప్రదాన కారకుడైన మృతురాలి భర్త ఉమ్మిడి కాసుబాబును కూడా అరెస్ట్ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తమ కూతురు హత్యగావించబడి ఇన్ని రోజులైనా నిందితులపై చర్య తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని మృతురాలు తల్లి ఆరోపించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారిపై కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకే కేసును తప్పుదోవ పట్టించి నీరు కార్చేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి పైన పేర్కొన్న నిందితులను నిర్భయ చట్టం ప్రకారం తక్షణమే అరెస్ట్ చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. లేకుంటే మహిళా సంఘం నాయకులు, రాష్ట్ర మత్స్యకార సంఘం నాయకులు, సిఐటియు నాయకుల ఆద్వర్యంలో తీవ్ర స్థాయి ఆందోళన మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో మృతురాలి కుటుంబ సభ్యులు, బందువులు, రాష్ట్ర మత్స్యకార సంఘం నాయకులు కొవిరి అప్పలరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము, మండల కార్య దర్శి సోమునాయుడు, మహిళా సంఘం నాయకురాలు పి.మాణిక్యం అదిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



అచ్యుతాపురం: సీజనల్ అంటు వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాదికారి భీమారావు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్తానిక పిహెచ్‌సిలో జరిగిన ఆశా కార్యకర్తల నెలవారి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో సహజంగా వాంతులు, విరేచనాలు, పచ్చకామెర్లు, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాదుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రంలో సామాజిక ఆరోగ్యాదికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు హరికృష్ణ, ఆర్ సుశీలా, సహాయకులు లండా అప్పలకొండ, అప్పారావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్ల మూసివేత తగదు

విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో మూసివేసిన సాంఘిక, సంక్షేమ హాస్టళ్లను వెంటనే తెరిపించాలని దళిత కులాల సంక్షేమ సేవా సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం గౌరవా ధ్యక్షులు జల్లూరి ప్రసాదరావు, జిల్లా అధ్యక్షులు పతివాడ రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంస్థల అధికారులు, దళిత సంఘాల నాయకులతో, రాష్ట్ర దళిత ప్రతినిధులతో సమావేశమై హాస్టళ్ళ నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలి కాని ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించి 34 హాస్టల్ళను మూసి వేసిందని ఆరోపించారు. ప్రభుత్వం తీరుపై వారు అభ్యం తరం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రెయ్యి వెంకటరమణ, మాటూరి చిన్నారావు, వి.ప్రకాశ్ రావు, ఎన్.నూకరాజు, సిహెచ్.చల పతిరావు తదితరులు పాల్గొన్నారు.

## సమయం

### కర్మ ప్రారబ్ధం

అవతార మూర్తులకు సైతం
కర్మ ప్రారబ్ధం తప్పదు
సంచిత, పురాకృత కర్మల
ఫలితం తప్పించుకొనుట అసాధ్యం
సుఖదుఃఖముల యందు సమదృష్టి
సర్వజీవ, సర్వమానవ సమానత్వ భావన
శృతి మించిన రాగద్వేషాదులు త్యజించుట
మన జీవన ప్రథమ కర్తవ్యం
సాదభావన, కర్మఫలములు త్యజించుట
తామరాకు పై నీటిబొట్టు జీవనం
ఈశ్వరార్పణ బుద్ధితో కర్మాచరణ
జనుల సేవతో జీవితాన్ని గడపడమే
జనార్ధనుని సేవ అన్నది ఆర్యక్తి

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : ఆషాడం; తిథి: ద్వాదశి రా.2.43; విశాఖ ఉ.06-28; వ.ఉ.10-53 ల 12.39.

బుధవారం 05-07-2017

**మేషం** : విద్యార్థులకు దూర ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా ఏ చిన్న అవకాశం దొరికినా సద్వినియోగం చేసుకోవటం మంచిది. వృత్తుల వారికి అన్ని విధాలా కలిసిరాగలదు. పాతమిత్రుల కలయిక కొత్త అనుభూతినిస్తుంది.

**వృషభం** : వైద్యులకు శస్త్రచికిత్స చేయునపుడు మెళుకువ అవసరం. ధన వ్యయం, చెల్లింపులలో మెలకువ వహించండి. కాంట్రాక్టర్లు, బిల్డర్లకు నిర్మాణ పనులలో ఊహించని చికాకు లెదుర్కోవలసి వస్తుంది. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం.

**మిధునం** : ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదాపడతాయి. స్త్రీలకు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. భాగస్వామికుల మధ్య కొత్త విష యాలు చర్చకు వస్తాయి. లీజు, ఏజెన్సీలు, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. విద్యార్థి నులకు ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు తప్పదు. మిత్రులను కలుసుకుంటారు.

**కర్కాటకం** : రియల్ ఎస్టేట్ రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. గతంలో నిలిపివేసిన పనులు పునఃప్రారంభిస్తారు. ఖర్చులు పెరి గినా ప్రయోజనకరంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి పంప కాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపారాల్లో పెరిగిన పోటీని తట్టుకోవటానికి బాగా శ్రమించాలి. ఆలయాలను సందర్శిస్తారు.

**సింహం** : సాంఘిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీ పనుల సాను కూలతకు పలుమార్లు తిరగవలసి ఉంటుంది. బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే విషయంలో జాగ్రత్త అవసరం. పాత వస్తువులను కొంటే ఇబ్బందులు తప్పవు.

**కన్య** : రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మీ సమర్థతపై ఎదుటివారికి విశ్వాసం ఏర్పడుతుంది. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. దుబారా ఖర్చులు అధికం.

**తుల** : రావలసిన ధనం చేతికందడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరుతుంది. స్త్రీల పట్టుదల వల్ల కుటుంబ సౌఖ్యం అంతగా ఉండదు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒకానొక సందర్భంలో మిత్రుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది.

**వృశ్చికం** :నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు పురోభివృద్ధి. బంధువుల రాక వల్ల మీరు కొంత అసౌకర్యానికి లోనవుతారు. దైవ సేవా కార్య క్రమంలో చురుకుగా పాల్గొంటారు. కోర్టు వ్యవ హారాలు కొత్త మలుపు తిరుగు తాయి. మీ మాటే నెగ్గాలన్న పంతం విడ నాడండి.

**ధనుస్సు** : స్త్రీలు కుటుంబ పరిస్థితులతో సర్దుకుపోవడం క్షేమ దాయకం. నూతన పరిచయాలు మీ పురోభివృద్ధికి నాంది పలుకుతాయి. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ఉపాధ్యాయులు విశ్రాంతికై చేయు యత్నాలు వాయిదా పడ తాయి.

**మకరం** :మనశ్శాంతి కోసం కొన్ని విషయాల్లో సర్దుకు పోవటం క్షేమదాయకం. మీ సంతానం అత్యుత్సాహాన్ని అదుపులో ఉంచటం మంచిది. స్త్రీలకు పనివారితో ఒత్తిడి, చికాకులు తప్పవు.

**కుంభం** : మీ ఏమరుపాటుతనం వల్ల పత్రాలు విలువైన వస్తువులు చేజారిపోయే ఆస్కారం ఉంది. రాజకీయాలలో వారికి ప్రత్యర్థులు పెరుగు తున్నారు అని గమనించండి. ప్రముఖుల కలయికతో పనులు సానుకూల మవుతాయి.

**మీనం** : ఉపాధ్యా యులకు అదనపు బాధ్యతలు, పనిభారం వంటి చికాకులు తప్పవు. స్త్రీలపై శకునాలు, చుట్టుపక్కల వారి వ్యాఖ్యలు తీవ్ర ప్రభా వం చూపుతాయి. కాంట్రాక్టర్లకు రావలసిన బిల్లుల వసూలులో ప్రయాసలను ఎదుర్కొంటారు.

# అక్షింతల పరమార్ధం తెలుసుకుందాం...

## సంకీర్తన



### చంద్రుడికి ప్రీతిపాత్రం

నవగ్రహాల్లో ఒక్కో గ్రహానికి ఒక్కో ధాన్యాన్ని దానవస్తువుగా పేర్కొంటారు. ఆ రకంగా నవగ్రహాలలో చంద్రుడికి ప్రీతి కరమైన దానవస్తువు బియ్యం. జ్యోతిషశాస్త్రం ప్రకారం చంద్రుడు మనస్సుకు అధినాయకుడు. మనిషి మనసు, బుద్ధి, గుణము, తల్లి, వ్యసనము ఇత్యాదులన్నీ చంద్ర కారకాలే అని అన్నారు పెద్దలు. అందుకే మనిషిపై చంద్రుడి ప్రభావం ఎక్కువగా ఉం టుంది. ఆ చంద్రుడికి సంకేతమైన బియ్యం కూడా మనిషి మనస్సుపై ప్రభావం చూపుతుంది. మనోధర్మాన్ని నియంత్రిస్తాయి.

### దీవెన పరమార్థం

శాస్త్రీయంగా చూస్తే, మనిషి దేహం ఓ విద్యుత్ కేంద్రం. విద్యుత్ సరఫరాల్లో హెచ్చుతగ్గులు సాధారణం. ఈ వ్యత్యాసాలు మనిషి మనస్సు మీద, ఆరోగ్యం మీద ప్రభావాన్ని చూపుతాయి. మనుషుల్లో తమో, రజో, సాత్త్వికాలనే త్రిగుణాలకూ కారకము. పెద్దలు వధూవరులపై అక్షతలు చల్లి ఆశీర్వదించే సమయంలో, దేహం లోని విద్యుత్తులో కొంత బాగం ఈ అక్షతలను తాకు తాయి. ఆశీస్సులు ఇచ్చే వాళ్ల నుంచి, పుచ్చుకొనే వాళ్ల కొంత విద్యుత్ బదిలీ అవుతుంది.

ఈ కారణంగా అక్షతల ద్వారా పెద్దలలో ఉండే సాత్విక గుణం పిన్నలకు లభిస్తుందనేది మన నమ్మకం.

పెద్దలు, విద్వాంసులు, గురువులు, తల్లి దండ్రులు, అత్తమామలు వివాహ సమయంలో, శుభకార్యాలలో మనకు అక్షతలు వేసి శిరస్సును తాకి ఆశీర్వదించడంలోని ఆంతర్యం, పర మార్థం ఇదే!

### జీవుడికి సంకేతం

మరో సిద్ధాంతం ప్రకారం చూస్తే మనిషి దేహంలో విద్యుత్ కేంద్రాలు ఇరవై నాలుగు ఉంటాయట. వాటిలో ప్రధానమైనది శిరస్సు. ఇది విద్యుదుత్పత్తి కేంద్రమే కాదు. విద్యుత్ ప్రసార కేంద్రం కూడా. తలపై అక్షింతలు వేయడం ద్వారా వాటిలోని విద్యుత్‌ను గ్రహించి దేహానికి ప్రసారం చేస్తుంది శిరస్సు.అది సరే కాని! అక్షతలుగా ఉపయోగించే బియ్యానికి పసుపు కుంకుమలు కలపడం ఎందుకు? ఆయుర్వేదం ప్రకారం, చర్మ సంబంధ రోగాల్ని అడ్డుకునే శక్తి పసుపుకు ఉంది. పసుపు నుంచి తయార య్యే కుంకుమకూ ఈ శక్తి ఉంది. అక్షతలు వేసే వారికి ఎలాంటి రోగ సమస్యలున్నా, పుచ్చు కొనే వాళ్ళకి అవి సోకకుండా ఈ పసుపు కుంకుమలు నివారిస్తాయట. అంతేకాక పసుపు కుంకు మలు శుభానికి సంకేతాలు కూడా. ఆధ్యాత్మికంగా చెప్పాలంటే జీవుడికి సంకేతం బియ్యం.

### భగవద్గీతలో ప్రస్తావన

అన్నాద్భవన్తి భూతాని అని మూడవ అధ్యాయంలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పాడు. జీవులు అన్నం చేత పుడతారట. ఈ అన్నం తయారీకి మనం ఉపయోగించే ధాన్యం బియ్యం. భగవం తునిపై అక్షతలు వేసి నమస్కరించడం అంటే, జీవుడు ఈ అన్నంలో పుట్టీ, తిరిగి ఈ జీవుడిని భగవంతుడిలోకి చేర్చడమే. అక్షతలలో ఇంతటి పరమార్థం గోచరిస్తుంది.తెలుగులో ఈ అక్షతలని తలంబ్రాలు లేదా తలబ్రాలు అని కూడా అంటారు. తలను:తల యందు పోయబడే, ప్రాలు:బియ్యం అని అర్థం.

### ధాన్యలక్ష్మికి ఆహ్వానం

పూర్వం వధువు ధాన్యలక్ష్మిగా చెప్పబడింది. ఈ తలంబ్రాల కార్యక్రమంలో బియ్యానికి ఒక ప్రత్యేకత ఉంది. ఓ వధువా! నీవు మా ఇంటికి వచ్చాక, మన ఇంట ధాన్యం ఇలా కుప్పతెప్పలుగా విరివిగా ఉండి, మన జీవనానికి ఆధారభూతమైన ధాన్యంతో మనం నిత్య సంపదల వాళ్ళమై తులతూగుతూ ఉండాలి అనే భావానికి అనుగుణంగా ఈ తలంబ్రాల కార్యక్రమం సాగుతుంది.

### వివాహకర్మ పరమార్థం

వరుడు, వధువు శిరస్సులపై తలంబ్రాలు పోసుకొనే దానికి ముందు, వరుడు ముందుగా వధువు చేతిని దర్భతో తుడిచి, దోసిలిలో రెండు మార్లుగా బియ్యాన్ని వేసి, ఆ మీదట పాలని కొద్దిగా చల్లి తలంబ్రాలకి సిద్ధం చేస్తాడు. తలంబ్రాలు వేసాక వధువు ఇలా చెయ్యాలని ఒక పద్ధతి చెబుతుంది. ఈ కాలంలో పురోహితులే చేయించి పోయిస్తున్నారు.ఈ కన్య వంశాన్ని తరింప జేయుగాక పుణ్యం వృద్ధి చెందుగాక.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# అధికారులు విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలి

## జడ్పీ ఛైర్‌పర్సన్ స్వాతిరాణి



వేపాడ : మండలస్థాయి అధికారులంతా తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి అన్నారు. మంగళవారం మండలాధ్యక్షురాలు దాసరి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బానాది సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామ పంచాయితీలో అనధికారంగా ఎల్ఇడి బల్బులు వేసిన వారిపై ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. గత సమావేశంలో ఫిర్యాదులు పరిష్కరించడంలేదని ఫిర్యాదులు తీసుకోవడం లేదని కాలక్షేపం చేస్తూ రోజులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమావేశాలతో గ్రామంలోని ప్రజలకు ఎటువంటి సమాధానం చెప్పలేకపోతున్నామని ఆయన అన్నారు. దీనిపై జడ్పీచైర్మన్ స్పందిస్తూ మండల స్థాయి అధికారులు తీరుపై మండిపడ్డారు. ప్రతి సోమవారం అన్ని శాఖలు ప్రజావాణి నిర్వహించాలన్నారు. సమావేశాలలో తీర్మానాలు పుస్తకాలు నిర్వహించాలని చెప్పారు. గత సమావేశంలో సమస్యలు ఎన్ని పరిష్కారం అయ్యాయో చదివి వినిపించాలన్నారు. గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామంలో గల సర్పంచ్‌లు, ఎంపిటీసీల సంతకాలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌ఓ భవనంవద్ద మొక్కలు నాటారు. ఈ సమావేశంలో ఎంపిపి దాసరి లక్ష్మి, ఎంపిడిఓ లక్ష్మి, ఎంఆర్‌ఓ పద్మావతి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



SVR గోల్డ్ లోన్స్
మీ బంగారాన్ని బ్యాంక్/ప్రైవేటు సంస్థలలో ఉన్నదానిని విడిపించి మార్కెట్ రేటు కంటే ఎక్కువకు కొనబడును.
Contact No:
75696 87774

శ్రీ దుర్గా మల్లేశ్వర ద్వాదశి జ్యోతిర్లింగ దేవాలయం
వివాహ విషయంలో ఆటంకములు ఎన్ని సంబంధములు చూసినా కుదరకపోవుట(స్త్రీలు, పురుషులు) సంతానం లేకపోవుట, వ్యాపార విషయంలో ఆందోళనలు, ఎంత కష్టపడినా ఫలితం లేకపోవుట, సమస్యల వలన సతమతమవుట, పైన ఉదహరించిన సమస్యలకు జాతక చక్రం వేసి, నాడీ పరీక్షించి, హస్త సాముద్రికం ద్వారా మీ సమస్యలకు ఖచ్చితమైన పరిష్కారం చూపబడును.
కాలసర్ప దోషం, నాగదోషం, కుజదోషం, రాహుకేతువుల పూజ, వివాహ విషయములకు, అన్ని రకముల పూజలకు సంప్రదించవచ్చును.
పెళ్ళిరోజు, పుట్టినరోజు, మీ ఉద్యోగ విరమణ ఇలా మరే సందర్భంలో అయిన అన్నదానం చేయు భక్తులు ముందుగా సంప్రదించినచో అతి తక్కువ ఖర్చుతో అన్నదాన కార్యక్రమం జరిపించి మరియు మీ గోత్ర నామముపై విశేష పూజ జరుపబడును.
సూచన : ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని రావలెను.
హైస్కూల్ గ్రౌండ్ ఎదురుగా, దేవి పీఠం, కొత్తవలస, విజయనగరం జిల్లా.
9441126714
8331827714

# రేషన్ లబ్దిదారులకు చరవాణీలు

మెంటాడ : రేషన్ దుకాణాల్లో నగదు రహితంగా సరుకులు కొనుగోలు చేసిన లబ్ధిదారుల్లో ఎంపికైన వారికి మండల కేంద్రమైన మెంటాడలో జడ్పీటీసీ సభ్యురాలు పొట్నూరు మాదవి, వైస్ ఎంపిపి చలుమూరి వెంకటరావు, తహశల్దార్ జి.యదేవి చరవాణీలను అందించారు. మార్చి నెల నుంచి మే నెల వరకు నగదు రహితంగా సరుకులు కొనుగోలు చేసిన వారిలో లాటరీ పద్దతిలో పలువురిని ఎంపిక చేశారు. మండలంలోని 34 రేషన్ డిపోల పరిధిలో మార్చినెలలో నలుగురికి, ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఆరుగురి వినియోగదారులు చవారణీలు పొందారు. ఆగూరు, అమరాయవలస, రాబంద, బడేవలస డిపోల పరిధిలో ఒక్కొక్కరికి, మెంటాడ, కంటుభుక్తవలస డిపోలు, కొండలింగాలవలస జిసిసి డిపో పరిధిలో ఇద్దరు చొప్పున, జక్కువ రెండో డిపో పోరాం ఒకటవ డిపో పరిదిలో ముగ్గురు చొప్పున లాటరీలు ద్వారా పొందారని సిహెచ్‌డిటి మల్లిఖార్జున తెలిపారు. నగదు రహిత లావాదేవీలు అందరూ ఖాతాలు ప్రారంబించి ఈ విధంగా మండలంలో గల రేషన్ లబ్ధిదారులు నగదు రహిత లావాదేవీలు వందశాతం చేయాలని ఎమ్మార్వో జయదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో జల్లపేట ప్రధమిక ఆరోగ్య కేంద్రం కమిటీ చైర్మన్ గెద్ద అన్నవరం, డీలర్లు సంఘ నాయకులు ఆర్.సన్యాసిరావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళిత బహుజన ఫ్రంట్ కార్యకర్తలు నిరసన




లక్కవరపుకోట : పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడూరు మండలం గరగపర్రు గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని అవర్ణాలు వారు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ జిల్లా దళిత బహుజన ఫ్రంట్ కార్యకర్తలు లక్కవరపుకోట మండలం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియ జేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో కూడా అగ్రకుల పెత్తందార్లు అనేక రూపాలలో దళితులపై దాడులు కొనసాగిస్తున్నా రన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబే ద్కర్ ఆశయాలను పాలకులు, పాలిత వర్గాలు ఇప్పటికీ దళితులపై దాడులు కొసాగిస్తూ కుల నిర్మూలనకు రాజ్యాంగ భవిష్యత్‌ను నిర్మించిన అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టను అడ్డుకోవడం రాజ్యాంగ బద్ధంగా నేరమని అన్నారు. చట్టాలు, రాజకీయాలు వాటి ప్రక్కన కొలువు కాస్తూ చూస్తున్నాయే తప్ప పీడిత వర్గాలకు, దళితులకు రాకుండా దేశ భవిష్యత్‌ను నిర్మించిన అంబేద్కర్‌కు అవమానం జరిగినట్లు బావించలేదన్నారు. దీనిని నిరసిస్తూ గరగపర్రు గ్రామంలో జరిగిన సంఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తూ ఆ గ్రామానికి రక్షణ కల్పిస్తూ అదే స్థానంలో అంబేద్కర్ విగ్రహాన్ని, అంబేద్కర్ పార్కుని నిర్మించాలని డిమాండ్ చేశారు.



విశాఖపట్నంలో మాధవధార మౌళి క్యాజిల్లో మంగళవారం కన్సుమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర సమావేశము జరిగినది. ఈ సమావేశమునకు నేషనల్ కన్సుమర్ రైట్స్ ఆర్గనైజేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్ శర్మ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు వికాస్ పాండే అధ్యక్షత వహించారు. ఈ సమావేశములో ఆర్గనైజేషన్ నూతన రాష్ట్ర కమిటిని మరియు జిల్లా కమిటిలను ఏర్పాటు చేయడము జరిగినది. ఈ సమావేశములో అందరికి నిమామక పత్రాలు జారి చేయడము జరిగినది. దీనిలో రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రామానుజ స్వామిని మరియు జిల్లా ప్రెసిడెంట్‌గా సనపల చంద్రమౌళిని (2 వ సరి వరుసగా) నిమమించడము జరిగినది. దీనిలో ఆర్గనైజేషన్ యెక్క కార్యక్రమాలు చేయు పనులు గురించి చర్చించారు.

# సింహాద్రినాధుని దర్శించుకున్న పోర్టుల చీఫ్ విజిలెన్స్ అధికారి



సింహాచలం : సింహగిరిపై కొలువుతీరివున్న వరాహలక్ష్మీనృసింహ స్వామివారిని విశాఖ, పారాదీప్, గోవా, అండమాన్ నికోబార్ పోర్టుల చీఫ్ విజిలెన్స్ అధికారి వివిఎస్ శ్రీనివాస్ దంపతులు తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలప్రకారం ఆలయ సహాయ కార్య నిర్వా హణాధికారి ఎంవి కృష్ణమా చార్యులు, పర్యవేక్షకులు కృష్ణా రావులు వీరికి ఘనస్వాగతం పలికారు. అర్చకస్వాములు పూర్ణ కుంభంతో ఆహ్వానం పలికారు. తొలుత వీరు కప్పస్థంభం ఆలిం గనం చేసుకుని వేదనాదాల నడుమ బేడాప్రదక్షణ చేశారు. తరువాత స్వామివారికి తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి శేషవస్త్రంతో సహాయ కార్యనిర్వాహణాధికారి సత్కరించి తీర్ధ ప్రసా దాలు అందజేశారు.

# నీట్ ఫలితాలలో నీరజ ప్రతిభ



వేపాడ : మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన కర్రి నీరజ నీట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈమె రాష్ట్ర స్థాయిలో 2480 ర్యాంకు, దేశ వ్యాప్తంగా 38715వ ర్యాంకును సొంతం చేసుకుంది. ఎంబిబిఎస్ చదివి గ్రామానికి సేవ చేస్తానని చెప్పింది.

ఈమె తండ్రి అప్పల నాయుడు వ్యవసాయ కూలీ. తల్లి అచ్చియ్యమ్మ గృహిణి. నీరజ 1వ తరగతి నుంచి పదవ తర గతి వరకు శృంగ వరపు కోటలో రామన్ విద్యా నికేతన్‌లో విద్యా భ్యాసం కొనసాగించింది. ఇంటర్ విశాఖలో స్టీల్‌ప్లాంట్ శ్రీ చైతన్యలో విద్యాభ్యాసం కొనసాగించింది.

నీటిలో మంచి ర్యాంకు రావడం వల్ల కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు అభినం దించారు.

# సింహగిరిపై ఘనంగా తొలిఏకాదశి



సింహాచలం : సింహాద్రిపై మంగళవారం తొలిఏకాదశి సందర్భంగా సింహాద్రినాధునికి ప్రత్యేక పూజలు జరిగాయి. తోలి ఏకాదశి సందర్భంగా స్థానాచార్యులు టిపి రాజగోపాల్ మాట్లాడుతూ దశమి ఏకాదశి కోసం ఎదురు చూడడం ప్రజాలందరికి అలవాటు అన్నారు ఎడాదిపొడుగు ఉండే 24 ఎకాదసుల్లో ఆషాడ శుక్ల ఏకాదశిని మంచిగా పరిగణిస్తారు పూర్వకాలంలో ఈరోజునే సంవత్సరా ఆరంభంగా పరిగణించేవారు అని తెలిపారు . ఉపవాసం పరమఔషదం అని ఉపవాస దీక్ష నాంది తోలి ఏకాదశి ఆషాడమాసం శుక్ల పక్ష ఏకాదశి నాడు విష్ణు మూర్తి పలకడలిపైన నిద్రలోకి వెళ్ళిన ఏకాదశిని తోలి ఏకాదశి అని అంటారన్నారు. స్వామివారు నిద్రించే సమ యం కాబట్టి దిన్ని సేవా ఏకాదశి అని కూడా అంటారు. ఈ తోలి ఏకాదశి పర్వదినమున ఉదయం బ్రమ్మ ముహూర్తాన నిద్రలేచి తలస్నానం చెయ్యాలి. పట్టు వస్త్రాలు ధరించాలి,పూజ మందిరాన్ని శుభ్రం చేసు కోవాలి. గడపకు పసుపురాసి బొట్లు పెట్టాలి, గుమ్మానికి తోరణం, వాకిలి ముందు ముగ్గు పెట్టాలి. పూజ మంది రంలో తెలుపు వస్త్రం పరచాలి, కలసంపైన కూడా తెల్లని గుడ్డ ఉంచాలి, విష్ణు మూర్తికి పూజ చెయ్యాలి, పసుపును కలిపినా అక్షిం తలు పూజకు ఉప యోగిం చాలి, జాజిమల తామర పువ్వు తులసి దళాలు పూజకు ఉపయోగించాలి. నైవేద్యం కోసం పాయసం ఆకుపచ్చని పండ్లు నేవిదించాలి. సతిసక్కుభాయి ఈ తోలి ఏకాదశి నాడే ప్రాప్తి పొందింది.

తొలి ఏకాదశి నాడు అంత ఉపవాసం ఉంది రాత్రికి జాగారం చేసి మర్నాడు అంటే ద్వాదశి రోజు ఉదయాన్నే విష్ణుమూర్తి పూజ చేసుకొని తిర్ధప్రసాధాలు స్వీకరించి తరువాత భోజనం చేస్తే జన్మజన్మాల పాపాలు తొలిగిపోతాయని ప్రజల నమ్మకం.రైతులి ఏరోజున జొన్నలు బెల్లం కలిసి పొడి చేసుకొని తింటారు తోలి ఏకాదశి రోజు పేలపిండి తినడం ఆనవాయితీగా వస్తుంది.పేలపిండి తోలి ఏకాదశి రోజు ప్రసాదం లాంటిది.పేలపిండి ఆరోగ్యానికి మంచిదని ఈ వర్షాకాలంలో ఎటువంటి రోగాలు రానివ్వకుండా కాపాడుతుందట.ఈ తోలి ఏకాదశి విష్ణుమూర్తి నిద్రలోకి వెళ్ళే రోజు భూమిపై రాత్రి సమయం పెరుగుతుందని తెలియజేసే సూచనా.అంటే ప్రజలలో నిద్ర సమయాలు పెరుగుతయన్నఅని తెలిపారు.

# భక్తిభావం పెంపొందించుకోవాలి

## ఎంపీపీ గొర్లె ఉమామహేశ్వరరావు

సబ్బవరం: ఆధ్యాత్మికతో భక్తి భావం పెంపొందించుకోవాలని సబ్బవరం మండల ఎంపీపీ గొర్లె ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మేజర్ పంచాయితీలో భాగమైన గొర్లెవానిపాలెం గ్రామంలో ఉమారామలింగేశ్వర కోదండ సీతారామ ఆలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్త అచ్చిమునాయుడు దంపతులు, ఎంపీపీ గొర్లె ఉమామహేశ్వరరావు పాల్గొని విశేష పూజలు జరిపారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొర్లె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భక్తి ప్రపత్తులతో శ్రీమన్నారాయణుని పూజించి, నిర్మలమైన మనస్సుతో స్వామి వారిని ధ్యానించి, భక్తి భావం పెంపొందించుకోవాలని భక్తులను కోరారు. భక్తిశ్రద్ధలతో శ్రీమన్నారాయణుని పూజించినప్పుడే సకాలంలో వర్షాలు పడి పాడిపంటలకు లోటు లేకుండా వుంటుందని అన్నారు. దేశం సుభిక్షంగా వుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మెంటాడలో

# మద్యంషాపు వద్దు

మెంటాడ : మండల కేంద్రమైన మెంటాడలో బ్రాందీషాపు ఏర్పాటు చేయవద్దని మహిళా సంఘాల సభ్యులు, సిపిఎం పార్టీ డివిజనల్ నాయకులు రాకోటి రాము, హరికృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామంలో నినాదాలు చేస్తూ తహశీల్దార్ జి.జయదేవికి వినతిపత్రం ఇచ్చారు. భార్యభర్తల మధ్య, పూటుగా తాగి ప్రజల మధ్య నిత్యం గొడవలు, అలాగే ప్రజల ప్రాణాలను హరిస్తున్న మద్యం షాపును గ్రామంలో నెలకొల్పవద్దని, ఆంద్ర ఎస్ఐ భాస్కరరావుకు వినతిపత్రం ఇచ్చారు. మద్యం షాపు వలన ప్రజలు ఆర్ధికంగా చితికిపోతున్నారని భావించి గ్రామస్తులందరూ ఏకతాటిపై నిలబడి మద్యం షాపు పెట్టుకోవడానికి స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. మద్యం షాపు ఏవిధంగానైనా పెట్టాలని మద్యం వ్యాపారులు భావిస్తుంటే గ్రామస్తులు రాత్రి, పగలు అన్న తేడా లేకుండా పహారా కాస్తున్నారు. ఇందులో ఎక్కువమంది మహిళలు కావడం విశేషం. మద్యం వ్యాపారులు గ్రామపెద్దలతో మంతనాలు కొన సాగి స్తున్నారు. గ్రామంలో రాత్రులందు మద్యం వద్దు, షాపును ఏర్పాటు చేయనివ్వద్దు అంటూ నినాదాలు చేస్తూ రాత్రి 12, 1 గంట వరకు మేల్కొని ఉంటున్నారు. మండల వీధి, నీలాటిరేవు వద్ద షాపు పెట్టడానికి షాపులు కదిపారు. నిత్యం జనవాసాలు ఉండే ప్రదేశంలో పెట్టమేమిటని ప్రశ్నించారు. దీంతో ఏంచేయాలో మద్యం షాపు వారికి అర్ధంకాక తలలు పట్టుకుంటున్నారు.

# సీడ్‌డ్రిల్‌పై రైతులకు అవగాహన



ఎల్.కోట : ఎల్.కోట మరియు కళ్లెంపూడి గ్రామాలలో ఆత్మపధకం ద్వారా సీడ్‌డ్రిల్‌తో వరి ఎద పద్దతిలో విత్తే విధానంపైన వ్యవసాయ సహాయ సంచాలకులు కె.మహరాజన్ ఆధ్వర్యంలో కోరుబిల్లి రమేష్, గుమ్మడి త్రినాధ్ పొలాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు.

ఈ కార్యక్రమంలో డిఎఎటిటి శాస్త్రవేత్త ఎం.ఎం. వి.శ్రీనివాస్ మాట్లాడుతూ విత్తనాలు విత్తేటప్పుడు పాటించవలసిన మెల కువలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఎఇఓలు, ఎంపిఇఓలు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM**

**I.A.1336/2015 IN T.O.P.716/2014**

**Between:**
**Siva Shakti Nagar Narava House plots owners Welfare Society Rep.by its Secretary Smt.Raakoti Eswaramma and another ...Petitioner**

**And:**
**Vommi Appa Rao and 14 others ...Respondents**

**16) Vommi Kunchibabu, S/o.Late Vommi Sanyasi, Hindu, Major, residing at Sattivanipalem, near Narava Village, Visakhapatnam.**

**17)Vommi Sattibabu, S/o. Late Vommi Simhachalam, Floor Mill Owner, Hindu, Major, residing at Sattivanipalem, near Narava Village, Visakhapatnam.**

**18) Vommi Appayamma, W/o Vommi Apparao, Hindu, Major, residing at Sattivanipalem, near Narava Village, Visakhapatnam.**

**SUMMONS TO RESPONDENT No.16,17 and 18**

**To,**
**16) Vommi Kunchibabu, S/o Late Vommi Sanyasi, Hindu, Major, residing at Sattivanipalem, near Narava Village, Visakhapatnam.**

**17)Vommi Sattibabu, S/o. Late Vommi Simhachalam, Floor Mill Owner, Hindu, Major, residing at Sattivanipalem, near Narava Village, Visakhapatnam.**

**18) Vommi Appayamma, W/o Vommi Apparao, Hindu, Major, residing at Sattivanipalem, near Narava Village, Visakhapatnam.**

**......**

**1.Please take notice that the above named petitioner filed the above TOP seeking transfer of OS No.395/2007, pending on the file of Hon'ble XII Additional District Judge, Visakhapatnam, to the file fo Hon'ble XIII Additional District Judge, Gajuwaka, Visakhapatnam. IA No.1336/2015 to add Shri.Vommi Kunchibabu, Vommi Sattibabu and Vommi Appayamma.**
**2. That the above TOP No.716/2014 and the IA No.1336/2015 is stands posted to 13-07-2017, at 10.30 AM, for your appearance in the above named court in person or through a pleader duly instructed and able to answer all material questions relating to the above proceedings. In default of your appearance on that day the matter will be decided on merits in your absence.**

**(By ORDER OF THE COURT)**
**Smt.D.Venkata Lakshmi Arrabolu**
**Advocate**
**H.No.33-14-27, 1st Floor,**
**Allipuram Main Road,**
**Visakhapatnam-530 004**

# బ్రాండిక్స్ మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి



అచ్యుతాపురం: బ్రాండిక్స్ మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలిరాము డిమాండ్ చేసారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చెసిన సమావేశంలో మాట్లాడుతూ బ్రామడిక్స్‌లో మహిళా ఉద్యోగులు వేల సంఖ్యలో విదులు నిర్వహిస్తున్నారని వీరికి రక్షణ లేకుండా పొయిందని ఆవేదన వ్యక్తం చేసారు. మహిళ ఉద్యోగులు విదులు ముగించుకొని ఇంటికి వెళ్ళె సరికి అర్ధ రాత్రి అవుతుందని యాజమాన్యం వీరికి భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల చోడవరంలో గల లక్కవరంలో బ్రాండిక్స్ ఉద్యోగులపై జరిగిన లైంగిక దాడులు పునరావతం కాకుండా బ్రాండిక్స్ యాజమాన్యం రక్షణ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి సోమునాయుడు, దేముడునాయుడు, ఐద్వా నాయకులు మాణిక్యం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



యానాం : విప్లవ వీరుడు బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్థానిక పెర్రీ రోడ్డులో గల అల్లూరి కాంస్య విగ్రహానికి ఇన్‌ఛార్జి పరిపాలనాధికారి కాలే సాయినాద్, సిఐ గూటం శివగణేష్, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎంఎ సిరాజ్జున్, ప్రజా పనుల శాఖ ఎఇ మేడిశెట్టి శ్రీనివాసు, అంబేద్కర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పోజాన్, ఆర్ఎఒ కార్యాలయం సూపరింటెండెట్ పెసల సూర్యనారాయణ, సమాచార శాఖ అధికారి కాళ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎం. సుబ్బారావు, దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షుడు జి. శంకరరావు, పెడికొండల వెంకటేశ్వరరావు, ఎ నారదా, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలమూరులో ఘనంగా రంగా 70వ జయంతోత్సవం



ఆలమూరు : మండల కేంద్రం ఆలమూరులో మండల కాపు సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా 70వ జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడి గుడి సెంటర్‌లో వున్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం బాణాసంచా కాల్పుల మధ్య ర్యాలీగా కాపు యువకులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలివెళ్లి అక్కడ రోగులకు రొట్టె, పండ్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపుసంఘం గౌరవ అధ్యక్షులు రామానుజుల శేషగిరిరావు, చల్లా సుధీర్, యెరుబండి సాయిబాబు, పురుషోత్తం వీర్రాజు, చల్లా భూషణం, గంధం చంద్రరావు, అప్పారావు, సుందర బూరయ్య, చిన్నం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జగన్నాథస్వామి తిరుగు రథోత్సవం

భీమునిపట్నం : భీమిలిలో జగన్నాథస్వామి రథాయాత్ర వైభవంగా జరిగింది. జగన్నాథస్వామి ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు జగన్నాథస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీమిలి లోగల ఇంద్రజమ్మం మందిరం దగ్గర స్వామివారి రథాన్ని ఉంచగా భక్తులందరూ విచ్చేసి జగన్నాథస్వామి వారిని దర్శించుకున్నారు. తదనంతరం, మెయిన్‌రోడ్, పాతబస్టాండ్ మీదుగా చిన్నబజార్ వరకూ భక్తులు ఉత్సాహంగా జగన్నాథస్వామి రథాన్ని లాగడంతో ఊరేగింపు ఘనంగా జరిగింది. పదిరోజులపాటు స్వామి దశావతారాల ప్రదర్శనను ఆలయం దగ్గర ఉన్న ఇంద్రజమ్మం మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ తిరుగు రథోత్సవంకు భక్తులు అధికంగా పాల్గొన్నారు.

# నీలపల్లిలో నిరసన దీక్ష విరమణ

తాళ్లరేవు : నీలపల్లి సంతమార్కెట్ కూడలిలో ధ్వంసంచేసిన విద్యాప్రదాత మల్లాడి సత్యలింగ నాయకర్ విగ్రహం స్థానంలో కొత్తది పెట్టాలని నిందితులను గుర్తించి శిక్షించాలన్న డిమాండ్‌తో నీలపల్లి జమ్మిచెట్టు జంక్షన్‌లలో అగ్నికుల క్షత్రియ సంఘం చేపట్టిన రిలేనిరాహార దీక్ష ముగిసింది.

ఆరో రోజులుగా నిరసనకు దిగినవారు అక్కడ రోడ్డుపై బైటాయించారు. ముంద స్తుగానే డిఎస్‌పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. దీక్షా శిబిరం వద్దకు ముమ్మిడింవరం, కాకినాడ నగర ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, వనమాడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పి. సతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బి. ఇందిరాలు విచ్చేసి నిరసన చేస్తున్న వారితో చర్చించారు. నిందితులు ఎంత టివారైనా పట్టుకొని శిక్షిస్తామని పాత విగ్రహం స్థానంలో కొత్తది ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే దాట్ల హామీఇచ్చారు. అనంతరం నాయకరఎ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నిరసనకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు.

ఈ కార్యక్రమంలో నీలపల్లి సర్పంచి రేవు మల్లీశ్వరి, వక్కా రెడ్డి, అగ్నికులక్షరతియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, కటకం శెట్టి వెంకటసత్య ప్రభాకర్, కర్రి చిట్టిబాబు, ఎంపిపి టేకుమూడి అనంత లక్ష్మి, జడ్‌పిటిసీలు పి. రామలక్ష్మి, ఎన్. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తొలి ఏకాదశి పూజలు

యానాం: తొలి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కాపుగంటి ఉమాశంకర్, అర్చకులు పి. రఘురామ్ వినోద్, పి. లక్ష్మణాచార్యులు, ఉదయం 4 గంటల నుండి పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యానం పరిసర ప్రాంతాల నుండి వాహనాల్లో తరలివచ్చి పూజలు నిర్వహించారు.

# సత్యదేవున్ని దర్శించిన అడిషనల్ ఎలక్షన్ కమీషనర్ దక్షిణమూర్తి



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారిని మంగళవారం అడిషినల్ ఎలక్షన్ కమీషనర్ కుటుంబ సమేతముగా స్వామివార్ని దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ సూపరింటెండెంట్ స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మహదాశీర్వచనం అందించగా సూపరింటెండెంట్ బలువు.సత్యశ్రీనివాస్ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట మండల ఆర్ఐ భాస్కర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విదేశి ఉద్యోగాల కొరకు జాబ్ మేళా

కంచరపాలెం : విదేశాల్లో ఉద్యోగాల కొరకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పానాధికారి సుబ్బిరెడ్డి తెలిపారు. దుబాయ్ (యు.ఎ.ఇ)లోని జ జీర ఎమిరేట్స్ పవర్ కంపెనీలో మేసన్స్, కార్పెంటర్, స్టీల్‌పిక్సర్స్, జనరల్ హెల్పర్స్ పోస్టులకు సంబంధించి విజయవాడ ఓంక్యాప్ వారి ఆధ్వర్యంలో బిర్లకూడలి వద్దనగల జిల్లా ఉపాధి కార్యాలయంలో 6వ తేదీ గురువారం దుయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పెర్కొన్నారు. ఈ మేరకు మేసన్స్‌కు సంబంధించి 20 పోస్టులు, కార్పెంటర్ 20, స్టీల్‌పిక్సెర్స్ 20 పోస్టులు ఉన్నాయని అభ్యర్థులు 3 నుండి 7 సంవత్సరాల అనుభవం ఉండి పాస్‌పోర్ట్ కలిగిఉండాలన్నారు. జనరల్ హెల్పెర్స్‌కు సంబంధించి 30 పోస్టులకు అభ్యర్థులు పదవ తరగతి పాసై, పాస్‌పోర్ట్ కలిగి ఉండాలన్నారు. పై అర్హతలు కలిగి ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు 120 జయంతి



భీమునిపట్నం : భీమునిపట్నంలో బీచ్ వద్ద గల అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద ఆయన విగ్రహానికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి భీమిలి జోనల్ కమీషనర్ బంటు సన్యాసినాయుడు, భీమిలి టిడీపి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వనం మనం కార్యక్రమంలో భాగంగా అక్కడ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి జివిఎంసి ఎఇ స్నేహ, టీడీపీ నాయకులు జి. సన్యాసినాయుడు, పెంటపల్లి యోగేశ్వరరావు, అప్పికొండ అప్పలనాయుడు, కె. నాగరాజు, జి.పోలిరాజు, ఎస్. జోగారావు, కెఎస్ఆర్ కృష్ణరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిపి పాశి నర్శింగరావు ఆవరణలో ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జెడ్ పిటిసి ఎస్. అప్పారావు, మూలకుద్దు, ఎంపిటిసి యరబాల కృష్ణవేణి, ఎండిఒ హరిప్రసాద్, విస్తరణాధికారి కుమార్ తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రిటీష్ పాలనకు ఎదురొడ్డిన మహనీయుడు అల్లూరి : రాధమ్మ



అయినవిల్లి : బ్రిటీష్ పాలనకు ఎదురొడ్డి పోరాడిన మహనీయుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని సామాజికవేత్త బి.ఎస్.రాధమ్మ అన్నారు. అయినవిల్లి మండలం విలస గ్రామం జిల్లా పరిషత్‌హైస్కూల్ వద్ద అల్లూరిజయంతి వేడుకలు జరిగాయి. తొలుత నిలువెత్తు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పప్పు పేరావధానులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి రాధమ్మ మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు దేశభక్తిని వివరించారు. ఆనాటి బ్రిటీష్ పాలకుల తీరుకు అల్లూరి ఎదురొడ్డి వారి తూటాలకు బలయ్యారని అన్నారు. అల్లూరి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని అన్నారు.

ఈ సమావేశంలో ఐ.ఎస్.ఎన్. రాజు, కె.నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయురాళ్లు కె.కరుణశ్రీ, సిహెచ్.సుమలత, ఎం.రాము, ఎస్.శివప్రసాద్, ఎం.శ్రీనివాస్, సరిపెల్ల రామ కృష్ణం రాజు, ఎస్.సతీష్‌రాజు, ఎస్.సుబ్బరాజు, గుంటూరి శివరాజు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



విశాఖసిటి : పార్లమెంట్‌లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని స్నేహజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అద్యక్షులు డాక్టర్ సిఎంఎ జహీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం విజెఎఫ్ఓ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ అల్లూరి సీతారామరాజు అటు దేశానికి ఇటు రాష్ట్రానికి, ప్రత్యేకంగా ఏజెన్సీ ప్రజల కోసం చేసిన త్యాగాలను గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి విగ్ర ఏర్పాటులో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అలాగే విశాఖపట్నంకు ఆయన పేరు పెట్టాలని సూచిం చారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు ఇమం ది రంగారావు, చెల్లూరి గిరీష్‌కుమార్, కామేశ్వర రావు,నౌషాద్,సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాల ఏర్పాటుపై తొలిగిన ప్రతిష్టంబన

## ఊపిరి పీల్చుకున్న అధికారులు, గ్రామస్తులు

ఆలమూరు : ఆలమూరు మండలంలోని మూలస్థాన అగ్రహారంలో విగ్రహాలు ఏర్పాటుపై గత 6 రోజులుగా ఏర్పడిన ప్రతిష్టంబన ఇరువర్గాల వారితో అధికారులు జరిపిన చర్చలు సఫలీకృతం కావడంతో తొలగిపోయాయి. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండపేట సి.ఐ. కె.లక్ష్మణరెడ్డి, ఎస్.ఐ. పి.దొరరాజు, తహశీల్దార్ కె.పద్మావతి, ఎంపిడిఓ నాతి బుజ్జిలు ఇరువర్గాల వారితో సామరస్య పూర్వక వాతావరణంలో చర్చలు జరిపి పలు సూచనలు చేసారు. తమ మధ్య ఎటువంటి ఘర్షణ లేదని, కలసిమెలసి వుంటామని మీ సూచనలు ప్రకారం విగ్రహాలు ఏర్పాటుకు ఎటువంటి అభ్యంతరాలు లేదని ఇరువర్గాలువారు పేర్కొన్నారు. విగ్రహాలు ఏర్పాటుపై జరిగిన ఘర్షణలో రెండు వర్గాలకు చెందిన 24మందిపై పెట్టిన కేసులను తొలగించాలని ఈ సందర్భంగా తహశీల్దారుకు వినతిపత్రం అందజేసారు. చివరికి తొలుత నిర్ణయించిన చోట అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి, ప్రక్కన మరోవర్గం వారు మరో విగ్రహం ఏర్పాటుకు కూడా అధికారులు అంగీకరించారు. అయితే అనుమతులు తీసుకొన్న తరువాతే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికి రెండువర్గాలువారు అంగీకరించినందున అటు అధికారులు, ఇటు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ చర్చలలో ఇరువర్గాలు తరపున వానపల్లి సత్యనారాయణ, దాకారపు సత్యం, పామర్తి శ్రీనివాసు, మూరా సత్యనారాయణ, వి. సుధాకర్, తోరాటి సత్తిబాబు, దొంగ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందలో అల్లూరి జయంతి వేడుకలు



విశాఖపట్నం : స్వాతంత్ర్య సమరయోధుడు మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు స్థానిక శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థలలో మంగళవారం ఘనంగా జరిగాయి. సంస్థల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ ఒమ్మి రఘురామ్ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించి అల్లూరి హైస్కూలు విద్యుతోపాటు విలువిద్య, గుర్రపు స్వారీ వంటి ఆటవిక విద్యలు నేర్చుకుని కె.డి.పేట అనే గిరిజన గ్రామానికి వెళ్ళి అక్కడ రామమందిరం నిర్మించి తపస్సు చేశాడని, గిరిజనులు ఆయనను దైవాంశ సంభూతుడుగా ఆరాధించేవారని, మహాత్ముని సహాయనిరాకరణోద్యమ సమయంలో అల్లూరి ప్రజలను ప్రభుత్వపు కోర్టులను బహిష్కరించ వలసిందిగా కోరారని, అప్పట్లో గ్రామ పంచాయతీ న్యాయ స్థానాలను ఏర్పరిచారని, బ్రిటీష్ పాలకులు ఆగ్రహంచెంది అల్లూరిని జైలుకు పంపారని, గిరిజనులకు న్యాయం జరగాలని నిరంతరం బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి ఆంగ్లేయులను దడదడలాడించిన అల్లూరి 1924 మే 5న బ్రిటీష్ వారు కాల్చి చంపారని ఆయన చనిపోతూ సీతారామరాజు లేకపోయినా నాలాంటి సీతారాములు వందల కొద్ది పుట్టుకొస్తారని, చివరి క్షణంలో కూడా ఆంగ్లేయులను అదరగొట్టిన మహా వీరుడు అల్లూరి దైర్యాన్ని విద్యార్థులందరూ గుర్తించి అలాంటి దైర్యసాహసాలు అలవరుచుకోవాలని కోరారు.

వివేకానంద స్కూల్ విద్యార్థులు, అల్లూరి సీతారామరాజు, మల్లుదొర, గంటందొర, రూదర్‌ఫర్డ్ మొదలైన వేషధారణలతో అల్లూరి చివరి ఘట్టం నాటక రూపంలో ప్రదర్శించి అందరినీ అలరించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో అల్లూరి యొక్క చరిత్రను ఆయన గొప్పతనాన్ని ప్రసంగంలో వివరించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ ఎమ్మెల్యేలుగా బిజెపి నేతలు

యానాం : పుదుచ్చేరి అసెంబ్లీలో ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేలుగా భారతీయ జనతాపార్టీ నేతల పేర్లు ఖరారయ్యాయి. ఈ మేరకు కేంద్ర హోంశాఖ నుండి బిజెపి నేతలకు ఉత్తర్వులు అందాయి. పుదుచ్చేరి బిజెపి అధ్యక్షులు వి. స్వామినాదం, కోశాధికారి శంకర్, పార్టీ మద్ధతుదారుడు విద్యాసంస్థ నిర్వాహకుడు సెల్వ గణపతులను నియామకం ఖరారు అయినట్లు పార్టీ ఆధిష్టానం సమాచారం పంపడం పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశ అయ్యింది. పార్టీ అధ్యక్షుడు వి. స్వామినాదన్ తమకు సమాచారం వచ్చిన తరువాత రాజ్‌భవన్‌కు సెల్వ గణపతితో కలిసి రాజ్‌నివాస్‌కు వెళ్ళారు. సాధారణగా నామినేటెడ్ ఎమ్మెల్యేలను ఏ పార్టీ అధికారంలో ఉందో వారే నియమించుకునేందుకు అవకాశం ఉండటం పరిపాటి. ముఖ్యమంత్రి సిఫార్సుచేసిన వ్యక్తులను లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదించి కేంద్రానికి సిఫార్సు చేయడం సంప్రదాయంగా వస్తుంది. పుదుచ్చేరిలో కాంగ్రెస్ కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండగా ఎన్‌డిఎ సిఫార్సు మేరకు లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితురాలైన కిరణ్‌బేడి బిజేపీ నేతల పేర్లను ముఖ్యమంత్రి, ఇతర మంత్రివర్గ సభ్యులకు తెలియకుండా సిఫార్సుచేయడం వారిని కేంద్ర హోంశాఖ ఆమోదిస్తున్నట్లు పార్టీకి సమాచారం ఇవ్వడంతో పుదుచ్చేరిలో ఉద్విగ్న వాతావరణానికి తెరలేపింది. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫార్సు చేస్తున్న ఏ సంక్షేమ పథకానికి అనుమతి ఇవ్వకుండా ప్రతిపాదనలు త్రిపి పంపుతున్న కిరణ్‌బేడి సెన్‌టెక్ పీజీ కోర్సు భర్తీలో అవకతవకలు జరిగాయంటూ సిబిఐకు ఫిర్యాదు చేయడం వారు సెన్‌టెక్ దస్త్రాలను సీజ్‌చేసి విచారణ ప్రారంభించడంతో ఇప్పుడు రాజనివాస్ పుదుచ్చేరి ప్రభుత్వం మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది.

ఈ తరుణంలో బిజేపీ నేతలతో కూడిన నామినేటెడ్ ఎమ్మెల్యే జాబీతా ఢిల్లీ నుండి రావడంతో కాంగ్రెస్, డిఎంకె కూటమికి మింగుడు పడుకుండా ఉంది. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి వి. నారాయణసామి కేబినెట్‌తో సమావేశమై సోమవారం రాత్రి చర్చించారు. ప్రభుత్వానికి నామినేటెడ్ ఎమ్మెల్యే నియమకంపై కేంద్ర హోంశాఖ ఏ సమాచారం పంపలేదని సిఎం నారాయణసామి తెలిపారు. పుదుచ్చేరి మిడియా మాత్రం బిజెపి నేతల పేర్లు ఖరారు అయినట్లు పత్రికల్లో ప్రధానంగా ప్రచరించాయి. నామినేటెడ్ ఎమ్మేల్యేల పేర్లు రావడం కాంగ్రెస్ ఎమ్మెల్యే కె. లక్ష్మీనారాయణ ఈ నెల 29న కోర్టులో ఫిల్ దాఖలుచేశారు.

లెఫ్టినెంట్ గవర్నర్ తరుపు న్యాయవాది కోర్టులో వాదనలు విన్న తరువాత నిర్ణయం చెపుతామని మద్రాసు హైకోర్టు పేర్కొంది. కిరణ్‌బేడీకి ముఖ్యమంత్రికి మద్య కొనసాగుతున్న సైదాతిక యుద్ధం రోజుకో విధంగా మలుపు తిరుగుతూ సర్వత్ర ఆసక్తి కలిగిస్తుంది. ఎదిఏమై నప్పటికీ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాని కాదని బిజెపి ఏజెంట్‌గా గవర్నర్ వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలో బహిరంగంగా వినిపి స్తున్నాయి.

గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి స్వచ్ఛభారత్ కార్యక్రమం పేరుతో ప్రజల్లో చొచ్చుకు వెళ్ళిన కిరణ్‌బేడి అకస్మాతుగా ఏకపక్షంగా బిజెపి నాయకురాలుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది. పుదుచ్చేరి అసెంబ్లీలో ఒక్క ఎమ్మెల్యేలేని బిజేపీ నేతలకు నామినేటెడ్ పదువులు ఇవ్వడంపై ప్రజల్లో అటు పార్టీల్లో ఆగ్రహం వ్యక్తం అవుతుంది. ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# చిత్రభాను

# చుక్కల్లో... పారితోషికాలు

దక్షిణాదిలో కథానాయికల పారితోషికాల గురించిన ప్రస్తావన వస్తే ముందుగా చెప్పుకోవాల్సిన పేరు నయనతార. తెలుగులో వచ్చిన శ్రీరామరాజ్యం చిత్రం తరువాత మహిళా ప్రధాన చిత్రాలకే పరిమితమైందీ కేరళ సోయగం. స్టార్ హీరోలకు ధీటుగా స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న నయనతార తనకంటూ ప్రత్యేకమైన మార్కెట్‌ను ఏర్పరచుకుని ప్రస్తుతం వరుస విజయాల్ని సాధిస్తున్నది. గత కొంత కాలంగా కోటి నుంచి కోటిన్నర తీసుకునే నయన ఇటీవల తమిళంలో రూపొందిన తని ఒరువన్, మాయ, నానుమ్ రౌడీథాన్ చిత్రాలు వరుసగా సక్సెస్ సాధించడంతో తన పారితోషికాన్ని మూడు కోట్లకు పెంచినట్లు తమిళ వర్గాల సమాచారం. తమిళంలో ప్రస్తుతం చిన్న చిత్రాలకు హీరోయిన్ అంటే అతిశయోక్తికాదేమో. బాహుబలిలో దేవసేనగా తనదైన నటనను ప్రదర్శించి విమర్శకుల ప్రశంసలందుకున్న ఈ యోగా టీచర్ తన పారితోషికాన్ని కూడా పెంచేసింది. గుణశేఖర్ దర్శకత్వంలో చారిత్రక నేపథ్యంలో రూపొందిన రుద్రమదేవి చిత్రానికి ముందు కోటి నుంచి కోటిన్నర తీసుకున్న అనుష్క బాహుబలితో పారితోషికాన్ని పెంచేసింది. రెండు భాగాలకు గానూ అక్షరాలా నాలుగు కోట్లు తీసుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం అనుష్క ఒక్కో సినిమాకు దాదాపు మూడు కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆమెకున్న స్టార్‌డమ్‌ని ద ృష్టిలో పెట్టుకుని నిర్మాతలు స్వీటీ (అనుష్క) అడిగినంత పారితోషికం ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. తాజాగా నటిస్తున్న మహిళా దాదాపు కోటి డెబ్బైఐదు లక్షలు తీసుకుంటున్నట్లు తెలిసింది. నాన్నకు ప్రేమతో సినిమాతో టాప్‌లీగ్‌లోకి ప్రవేశించిన రకుల్ ఈ సినిమా నుంచే ఎక్కువ మొత్తాన్ని డిమాండ్ చేయడం మొదలుపెట్టింది. ఇటీవల విడుదలైన ధ ృవ కోసం దాదాపు రెండు కోట్లు తీసుకుందనే వార్తలు వినిపించాయి. ప్రస్తుతం జయ జానకి నాయక, స్పైడర్ చిత్రాలతో పాటు హిందీలో ఐయారీలో నటిస్తోంది.

**మహానటితో వెలుగులోకి....**

నేను శైలజ, నేను లోకల్ వంటి వరుస విజయాలతో తెలుగు ప్రేక్షకుల ద ృష్టిని ఆకర్షించిన చెన్నై చిన్నది కీర్తిసురేష్. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో మూడు క్రేజీ ప్రాజెక్టుల్లో నటిస్తూ బిజీగావుంది. పవన్‌కల్యాణ్‌తో త్రివిక్రమ్ రూపొందిస్తున్న సినిమాతో పాటు సావిత్రి జీవిత చరిత్ర ఆధారంగా సినిమా కూడా లేకపోవడం గమనార్హం. తమిళంలో ఏకంగా ఆరు చిత్రాల్లో నటిస్తూ బిజీగా వున్న త్రిష ఒక్కో సినిమాకు కోటిన్నర నుంచి రెండు కోట్లు వసూలు చేస్తున్నది. ఆమె నటిస్తున్న చిత్రాల్లో కొన్ని త్వరలో తెలుగులోనూ విడుదల కానున్నాయి. బాహుబలి సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపును తెచ్చుకున్న తమన్నా ఒక్కో సినిమాకు కోటి నుంచి కోటిన్నర తీసుకుంటున్నది. అయితే ప్రస్తుతం ఆమెకు తెలుగులో చెప్పుకోదగ్గ అవకాశాలు లేవు. సందీప్‌కిషన్ హీరోగా ఫనా ఫేమ్ కునాల్ కోహ్లీ రూపొందిస్తున్న ద్విభాషా సినిమా తప్ప తెలుగులో తమన్నాకు చెప్పుకోదగ్గ సినిమా లేకపోవడం గమనార్హం. 60 లక్షల నుంచి కోటి తీసుకుంటున్న వారి జాబితాలో రాశీఖన్నా, లావణ్యత్రిపాఠి, హెబా పటేల్, శ్రియ, రెజీనా, తాప్సీ, అంజలి వంటి తారలు వున్నారు. ఒకప్పుడు కోటితో సరిపెట్టుకునే కథానాయకలు



సూపర్‌స్టార్‌గా నిలిచిందామె. ఇటీవల ఆమె నటించిన పలు చిత్రాలు విజయవంతమై నిర్మాతలకు లాభాల్ని అందించడంతో చాలా మంది నిర్మాతలు నయన అడిగిన పారితోషికాన్ని ఇవ్వడానికి వెనుకాడటం లేదు. బాక్సాఫీస్ క్వీన్‌గా పేరుతెచ్చుకుంటున్న ఆమె దక్షిణాదిలోనే అత్యధిక పారితోషికాన్ని డిమాండ్ చేస్తున్న నాయికగా నిలవడం విశేషం. ప్రస్తుతం బాలక ృష? కథానాయకుడిగా తమిళ దర్శకుడు కె.ఎస్.రవికుమార్ ఓ చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. సి.కల్యాణ్ నిర్మించనున్న ఈ చిత్రంలో నయనతారను కథానాయికగా ఎంపిక చేశారు. ఈ సినిమా కోసం ఆమె నాలుగు కోట్లు తీసుకుంటున్నట్లు తెలిసింది.

**శాసిస్తున్న దేవసేన....**

లేడీ సూపర్‌స్టార్‌గా పేరుతెచ్చుకున్న విజయశాంతి తరువాత మహిళా ప్రధాన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది బెంగళూరు సోయగం అనుష్క. కమర్షియల్ చిత్రాల్లో నటిస్తూనే మరో పక్క అరుంధతి వంటి మహిళా ప్రధాన చిత్రాలకు ప్రాధాన్యతనిస్తున్నది. స్టార్ హీరోలకు సమానమైన గుర్తింపుతో పాటు మార్కెట్‌నూ సొంతం చేసుకున్న అనుష్క ప్రస్తుతం దక్షిణాదిలో హాట్ ఫేవరేట్ ప్రధాన చిత్రం భాగమతి కోసం అనుష్క దాదాపు నాలుగు కోట్లకు మించి తీసుకున్నట్లు సమాచారం. బాహుబలి ది కన్‌క్లూజన్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపును సొంతం చేసుకున్న ఆమె రానున్న రోజుల్లో బాలీవుడ్‌కు వెళ్లే అవకాశం వుందని తెలిసింది.

**ఆ ఇద్దరి తరువాత....**

కోటి నుంచి దాదాపు రెండు కోట్లు అందుకుంటున్న నాయికల జాబితాలో సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్, కీర్తిసురేష్ వున్నారు. వీరిలో ప్రథమంగా వినిపించే పేరు సమంత. కెరీర్ ప్రారంభం నుంచి వరుస విజయాల్ని సొంతం చేసుకుంటూ క్రేజీ కథానాయికగా పేరుతెచ్చుకున్న సమంత ఒక్కో సినిమాకు ప్రాజెక్ట్‌ను బట్టి రెండు కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో సుకుమార్ తెరకెక్కిస్తున్న రంగస్థలం చిత్రంతో పాటు నాగార్జున నటిస్తున్న రాజుగారి గది-2, విజయ్‌తో మెర్సల్, తెలుగు, తమిళ భాషల్లో సావిత్రి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న మహానటి వంటి తదితర చిత్రాల్లో నటిస్తున్నది. సమంతా తరువాత టాలీవుడ్‌లో రకుల్‌దే హవా. కెరీర్ తొలినాళ్లల్లో కేవలం ఆరు లక్షలే పారితోషికం తీసుకున్న ఈ ఢిల్లీ సోయగం ప్రస్తుతం ఒక్కో సినిమాకు కోటిన్నర నుంచి రూపొందుతున్న మహానటి, సూర్య హీరోగా నటిస్తున్న తానా సేర్న్‌ద కూట్టం చిత్రాల్లో నటిస్తోంది. నేను శైలజ చిత్రానికి గానూ కోటి లోపే పారితోషికాన్ని తీసుకున్న కీర్తి మహానటి కోసం రెండు భాషలకు కలిపి దాదాపు మూడు కోట్లు తీసుకున్నట్లు తెలిసింది. కాగా ఒక్కో సినిమాకు కీర్తిసురేష్ కోటిన్నర నుంచి రెండు కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తమిళ చిత్ర వర్గాల సమాచారం. ఎన్టీఆర్ నటించిన జనతాగ్యారేజ్ సినిమాలోని ప్రత్యేక గీతం కోసం 75లక్షల పారితోషికం తీసుకుని అందరిని ఆశ్చర్యపరిచింది కాజల్‌అగర్వాల్. ఆ తరువాత చిరంజీవి రీఎంట్రీ ఇచ్చిన ఖైదీనంబర్ 150 చిత్రానికి రెండు కోట్లు వసూలు చేసింది. ప్రస్తుతం తెలుగులో నేనే రాజు నేనే మంత్రి, కల్యాణ్‌రామ్ నటిస్తున్న ఎమ్ఎల్ఏ చిత్రాలతో పాటు తమిళంలో అజిత్ హీరోగా నటిస్తున్న వివేగం, విజయ్ చేస్తున్న మెర్సల్ చిత్రాలకు కాజల్ కోటిన్నర నుంచి రెండు కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్నట్లు సమాచారం.

**కోటిన్నర జాబితాలో....**

ఈ జాబితాలో శ ృతిహాసన్, త్రిష, తమన్నా, పూజా హెగ్డే వున్నారు. ఈ నలుగురిలో శ ృతిహాసన్, త్రిషలకు తెలుగులో ఒక్క ప్రస్తుతం బడ్జెటే కాకుండా సినిమా మార్కెట్ పరిధి కూడా పెరగడంతో భారీగా డిమాండ్ చేయడం కొత్త ట్రెండుగా మారింది.

చిత్రసీమలో పారితోషికాల ప్రస్తావన అంతా అగ్ర హీరోల చుట్టే తిరుగుతుందనేది నిర్వివాదాంశం. ఫలానా చిత్రానికి సదరు హీరో భారీ మొత్తంలో అందుకున్నాడట..ఇదొక కొత్త రికార్డు అనే మాటలు పరిశ్రమలో తరచూ వినిపిస్తుంటాయి. అయితే ఇప్పుడు హీరోలతో పోల్చితే మేమెందులోనూ తీసిపోం అంటూ కథానాయికలు సవాళ్లు విసురుతున్నారు. కొందరు టాప్ హీరోయిన్స్ కళ్లుచెదిరే పారితోషికాల్ని స్వీకరిస్తున్నారు. మహిళా ప్రధాన చిత్రాలు, కథానాయిక నేపథ్య చిత్రాల రూపకల్పన ఎక్కువ కావడంతో ప్రస్తుతం మన నాయికలు తిరుగులేని స్టార్‌డమ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. తమకున్న డిమాండ్‌కు అనుగుణంగా భారీ మొత్తంలో పారితోషికాల్ని కోరుతున్నారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి చిత్రంలో చిరంజీవి సరసన నటించడానికి ఐశ్వర్యరాయ్ తొమ్మిది కోట్లు డిమాండ్ చేసిందంటే పారితోషికం విషయంలో మన తారామణులు ఎంత బెట్టుమీద వున్నారో అర్థం చేసుకోవచ్చు....

---

## మొక్కలను పెంచుదాం-పర్యావరణాన్ని కాపాడుదాం

*- నగర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రేమకుమారి*

గాజువాక: మొక్కలను పెంచి పర్యావరణాన్ని కపాడుకోవలసిన బాధ్యత మనందరిమీద ఉందని, అందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలను పెంచేందుకు కృషి చేయాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడు కోవచ్చునని బీజేపీ నగర మహిళా మోర్చా అధ్యక్షురాలు జి.ప్రేమకుమారి పేర్కొన్నారు. మంగళవారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భాజపా వ్యవస్థాపకులు డా. శ్యామ్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ ఆంధ్రప్రదేశ్ మహిళా మోర్చా అద్వర్యంలో జూలై 6వ తేదీనుంచి 12వ తేదీ వరకు మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నదని తెలిపారు. బీజెఎంఎం సభ్యులందరూ ఒక మొక్కనాటి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె ప్రేమ కుమారి కోరారు.

## సత్యసాయి విద్యా సంస్థలలో వన మహోత్సవం

రావులపాలెం : జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో గల అల్లూరి సీతారామరాజు కాంశ్య విగ్రహానికి మండల పరిషత్ అధ్యక్షులు కోట చెల్లయ్య, ఉపాధ్యక్షులు దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు లు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ కూలీలకు గుణపాలను పంపిణీ చేసారు. అనంతరం స్థానిక సత్యసాయి విద్యా సంస్థల్లో వన మహోత్సవం సందర్భముగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈతకోట గ్రామంలో యూనియన్ బ్యాంక్ బ్రాంచి మేనేజరును బిసి & కాపు కార్పోరేషన్ ఋణములు గ్రేడింగ్ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## వెనుకనుండి లారీ ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలు

రావులపాలెం : యర్రంశెట్టి గంగరాజు గంటి పెదపూడి నుండి వ్యాపారం నిమిత్తం కడియం వెళుతుండగా స్థానిక డిగ్రీ కళాశాల ఎదురుగా వచ్చే సరికి వెనుకనుండి టిఎన్31 బిటి 6953 నెంబరు గల లారీ డీకొట్టిన సంఘటన చోటు చేసుకుంది.

ఈ సంఘటనలో గంగరాజుకు స్వల్పంగా గాయాలయ్యాని

స్థానికులు, బంధువుల సహాయంతో వైద్యం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారని

గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిహెచ్ విద్యా సాగర్ తెలిపారు.

## గ్యాస్ డెలివరీ కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలి

కాకినాడ : వెంకట్రామా ఇండేన్ సర్వీస్‌లో పని చేయుచున్న ఎల్‌పిజి.ఇండేన్ గ్యాస్ డెలివరీ కార్మికులందరికీ చట్టబద్ధంగా కనీస వేతనాలు అమలు చేయాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద గ్యాస్ డెలివరీ వర్కర్స్ ఆధర్యంలో ధర్నా నిర్వహిచారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక చట్టాలు అమలు కోసం కార్మికులంతా సంఘటితం కావాలన్నారు. కార్మిక సంఘాలు లేనిచోట కార్మికుల హక్కులు,సౌకర్యాలను యాజమాన్యాలు హరిస్తున్నాయన్నారు.

డెలివరీ వర్కర్స్‌కు 1950 షాపులు మరియు ఎస్టాబ్లేస్ మెంట్ చట్టం ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని,అలాగే 20మంది కార్మికులుంటే పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ,ఏడాదికి 20శాతం బోనస్‌లు ఇవ్వాలని డిమండ్ చేశారు.కార్మికులందరికీ ఉద్యోగ బధ్రత కల్పిస్తూ అపాయింట్ మెంట్ ఆర్డర్స్ (ఎస్.ఫారాలు) ఇవ్వాలన్నారు.రోజుకు ఎనిమిది గంటల పనిదినం అమలు చేసి వారంతపు సెలవు ఇవ్వాలన్నారు.గ్యాస్ మెకానిక్‌పను లను కార్మికులతో చేయిచకుండా సంబందిత మెకానిక్‌లను నియమించుకోవాలన్నారు.గ్యాస్ డెలివరీ కోసం వాహనాలు ఏర్పాటుచేసి ఆయిల్ మెయింట్‌నెన్స్ ఖర్చులు యాజమాన్యం భరించాలన్నారు.ప్రతీ కార్మికునికీ రెండు జతల చెప్పులు,4జతల యూనిఫాం ఇవ్వాలన్నారు.డెలివరీ కార్మికులతో ఆఫీసు,గొడౌన్లు శుభ్రపరచడం వంటి వెట్టి చాకిరీలు చేయించరాదన్నారు.

కార్మికులకు బకాయి పడ్డా వేతనాలు చెలించాలన్నారు.గ్యాస్ డెలివరీ కార్మికులు ప్రమాదాలకు గురి అయితే పూర్తి వైద్యం చేయించి పనిలో చేరేవరకూ జీతం చెల్లించాలన్నారు.అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ ధర్నా కార్యక్రమంలో వీరబాబు , నాగబాబు, .పి.చక్రవర్తి, వీరబాబు, వెంకన్న,దుర్గారావు, విజయ్‌బాబు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఓ పెన్ స్కూల్ ప్రవేశానికి ప్రకటన విడుదల

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ 2017 -18 విద్యా సంవత్సరానికి పదవతరగతి,ఇంటర్మీడియట్ ప్రవేశమునకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ .అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు.పదవతరగతికి పురుషులు రూ.1500లు,అన్ని వర్గాల మహిళలు,ఎస్సీ,ఎస్టీ,బిసీ,మైనారిటీ మరియు పిహెచ్‌సి పురుషులు రూ.1100లు ,ఇంటర్మీడియట్ రూ.1700లు,అన్ని వర్గాల మహిళలు,రూ.1400లు ఫీజుచెల్లించాలన్నారు.ప్రవేశమునకు అపరాధ రుసుము లేకుండా ఆగస్టు 31వరకూ,అపరాద రుసుం 10వతరగతికి రూ.వంద,ఇంటర్మీడియట్ కి రూ200లతో సెప్టెంబరు30వరకూ చెల్లించవచ్చున్నారు.ప్రాస్పెక్టస్ మరియు అప్లికేషన్ ఫారం సంబందిత స్టడీ సెంటర్ నుండి ఉచితంగ పొంది పూర్తి చేసి సంబందిత కో ఆర్డినేటర్‌ద్వారా ఆన్ లైన్ చేయించుకొని ప్రింట్ అవుట్ తీసుకోవాలన్నారు.తప్పులు ఉంటేసరిచూసుకొని మీసేవ, ఎపిఆన్‌లైన్ కేద్రం వద్ద అదనంగా సర్వీసు ఛార్జీరూ.30 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయిచుకోవాలన్నారు.ఆన్ లైన్ అప్లికేషన్ జిరాక్స్ కాపీని ,ఫీజు రసీదును సంబందిత ఎ1 కేంద్రంలో ఇవ్వాలి.30రోజులు విధిగా తరగతులకు హాజకావాలన్నారు.స్టడీ సెంటర్లలో ఎటువంటి ఫీజులు చెల్లించవలసిన అవసరం లేదన్నారు.ముఖ్యంగా దళారులను నమ్మవద్దని ఆయన తెలిపారు.మరిన్ని వివరములకు ఎ1 కేంద్రాలను లేదా జిల్లా కోఆర్డినేటర్ కొమ్మన జనార్ధన రావు 8008403504,9959495486 పోన్ నెంబర్లను సంప్రదించాలని అబ్రహం తెలిపారు.

## యువతి అదృశ్యంపై కేసు నమోదు

రావులపాలెం : ఒక యువతి అదృశ్యంపై రావులపాలెం పోలీస్ స్టేషనులో కేసు నమోదైంది. ఎస్సై సి.హెచ్. విద్యాసాగర్ కథనం ప్రకారం రావులపాలెం మండలం, ఊబలంక గ్రామానికి చెందిన చింతా లక్ష్మి నవీణ (19) ఈ నెల 1వ తేదీన కళాశాలకు తానే తీసుకువెళ్ళి సాయంత్రం ఇంటికి తీసుకురావడానికి వెళ్ళే సరికి తన కుమార్తె కనిపించకపోవడంతో కళాశాలలో అడగగా ఉదయమే అనారోగ్యం కారణంగా ఇంటికి వెళ్ళిపోవుచున్నానని చెప్పిందని కళాశాలలో తెలిపారని తండ్రి చింతా సత్యనారాయణరెడ్డి తన ఫిర్యాదులో తెలిపారు.

అప్పటినుండి ఇప్పటివరకు తన కుమార్తె కోసం ఎంత వెతికినా కనిపించకపోవడంతో మంగళవారం తన కుమార్తె కోసం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిహెచ్ విద్యా సాగర్ తెలిపారు.

# పోలీసుశాఖలో బదిలీలు

**మొదటి పేజీ తరువాయి**

3, ఎన్ సుబ్బారావు - ఎస్‌డిపిఒ పెనుకొండను ఎస్‌డిపిఒగా చిత్తూరు,
4, సిహెచ్ రామారావు - డిఎస్‌పి ఇంటెలిజెన్సీను ఎస్‌డిపిఒగా పెద్దాపురం,
5, ఎ.వి.ఎల్. ప్రసన్నకుమార్ - డిఎస్‌పి నార్త్, రాజమండ్రి అర్బన్‌ను ఎస్‌డిపిఒగా అమలాపురం,
6. కండె శ్రీనివాసులు - డిఎస్‌పి ట్రాఫిక్ గుంటూరు అర్బన్‌ను డిఎస్‌పి ఈస్ట్ గుంటూరు అర్బన్,
7. పి. మహేష్ - ఎస్‌డిపిఒ, బాపట్లను ఎస్‌డిపిఒ, గుడివాడ,
8. ఎస్.వి. గోపాల క్రిష్ణ - డిఎస్‌పి/అస్టింట్, కమాండెంట్, సెకెండ్ బిఎన్ ఎపిఎస్‌పి, కర్నూల్‌ను ఎస్‌డిపిఒగా నంధ్యాల,
9. కె.వి. రాఘవరెడ్డి - డిఎస్‌పి, సిఐడి ని ఎస్‌డిపిఒ నెల్లూరు రూరల్,
10. కె. రఘు - డిఎస్‌పి సిఐడిని ఎస్‌డిపిఓ కావలి,
11. ఎన్. వెంకటరామాంజనేయులు - ఎస్‌డిపిఓ, కదిరి నుండి ఎస్‌డిపిఒ మర్కాపూర్,
12. ఎ. శ్రీనివాసురావు - డిఎస్‌పి ఎస్‌బి మరియు సెక్యూరిటీ రాజమండ్రి అర్బన్‌ను డిఎస్‌పి నార్త్ రాజమండ్రి,
13. ఎం. మునిరామయ్య - ఎస్‌డిపిఒ తిరుమలను ఎస్‌డపిఒ ఈస్ట్ తిరుపతి,
14. ఎల్. అర్జున్ - డిఎస్‌పి/అస్టింట్ కమాండెంట్, ఐదవ బెటలియన్ ఎపిఎస్‌పి, విజయనగరంను ఎసీపీ నార్త్ (ప్రస్తుతం వెస్ట్)విశాఖ,
15. కె. వెంకటరమణ - డిఎస్‌పి, సిఐడిని ఎస్‌డిపిఒ అనకాపల్లి,
16. ఎస్. వెంకటేశ్వరరావు- ఎస్‌డిపిఒ, కాకినాడను ఎస్‌డిపిఒ కొవ్వూరు,
17. సిహెచ్. మురళీక్రిష్ణా - డిఎస్‌పి, సిఐడిని ఎస్‌డిపిఒ జంగారెడ్డిగూడెం లకు బదిలీ చేశారు.

పైన పేర్కొన్న అఫీసర్స్ వారికి బదిలిచేసిన ప్రదేశాలలో వెంటనే రిపోర్టు చేస్తూ పోలీస్ హెడ్ క్వార్టర్సుకు తెలియజేయవలెనని ఆదేశించారు.

# రామ్‌నాద్ కోవింద్‌కు గన్నవరంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఘనస్వాగతం



విజయవాడ : విజయవాడ - రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు కేంద్రమంత్రి ఎం.వెంకయ్య నాయుడు బి.జె.పి.జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు సమక్షంలో ఎన్.డి.ఏ రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాద్ కోవింద్ అంధ్ర రాష్ట్ర పర్యటన సందర్భంగా విజయవాడలో గన్నవరం విమానఆశ్రయంలో బి.జె.పి.రాష్ట్ర అధ్యక్షులు డా॥కంభంపాటి హరిబాబు ఎం.పి.ఘన స్వాగతం పలికారు. బి.జె.పి.రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాసరావు, పి.మాణిక్యలరావు, ఎం.పి.గోకరాజు గంగరాజు,ఎం.ఎల్.ఎ.లు విష్ణునుకుమార్ రాజ్,ఆకుల సత్యనారయణ, ఎ.ఎల్.సి.లు సోము వీరాజ్,పి.వి.ఎన్.మాధవ్ మరియు బి.జె.పి.మాజీ కేంద్ర మంత్రులు కావూరి సాంబశివరావు రాష్ట్ర మాజీ మంత్రి కన్నలక్ష్మీనారయణ,రాష్ట్ర బి.జె.పి.సంఘనా ప్రధాన కార్యదర్శి జి.ఆర్.రవీంద్రరాజు జాతీయ కార్యవర్గ సభ్యులు శాంతరేడ్డి,రాష్ట్ర నాయకులు వి.శ్రీనివాసరాజు, ఎస్.సి.మోర్చా జాతీయ కార్యదర్శి డి.సి.రోశయ్య ఐ.ఎ.ఎస్.ఎస్.మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ధార సాంబయ్య మాజీ ఎం.ఎల్.ఎ, మైనారిటి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్.బాజి.రాష్ట్ర మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శరణాల మాలతీరాణి,బి.జె.పి.కృష్ణ జిల్లా అధ్యక్షులు చిగురుపాటి కుమరస్వామి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంగ్లాండ్ పర్యటనకు ద్రవిడ్ దూరం



దిల్లీ: ఇండియా-ఎ, అండర్-19 క్రికెట్ జట్లకు భారత మాజీ ఆటగాడు రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా తిరిగి ఎంపికైన విషయం తెలిసిందే. ఇటీవల బీసీసీఐతో తాజాగా రెండేళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్న ద్రవిడ్ త్వరలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే అండర్-19 భారత జట్టుకి దూరం కానున్నాడు. జులై 5 నుంచి ఈ పర్యటన ప్రారంభం కానుంది. కోచ్‌గా బాధ్యతలు తీసు కున్న ద్రవిడ్ ఇంగ్లాండ్ పర్యటనకు ఎందుకు వెళ్లడంలేదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బీసీసీఐ ప్రతినిధి ఒకరు వివరణ ఇచ్చారు.

జులైలో ఇండియా-ఎ జట్టు ముక్కోణపు వన్డే సిరీస్ కోసం దక్షిణాఫ్రికాలో పర్యటించనుంది. ఆస్ట్రేలియా-ఎ, దక్షిణాఫ్రికా-ఎ, ఇండియా-ఎతో ఈ సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ కోసం ద్రవిడ్ భారత్-ఎతో కలిసి దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్నాడు. వన్డే సిరీస్ అనంతరం అనధికార టెస్టు మ్యాచ్‌లను భారత్ ఆడనుంది.

ఈ కారణం వల్లే ద్రవిడ్ అండర్-19 జట్టుతో ఇంగ్లాండ్ వెళ్లలేకపోతున్నాడని బీసీసీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు.

బీసీసీఐతో తాజా ఒప్పందం కోసం ద్రవిడ్ ఐపీఎల్‌కి గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఐపీఎల్-10లో ద్రవిడ్ దిల్లీ డేర్‌డెవిల్స్ జట్టుకి కోచ్‌గా బాధ్యతలు నిర్వహించాడు. అండర్-19, భారత్-ఎకి కోచ్‌గా ఒప్పందం కుదుర్చుకోవాలంటే మరే ఇతర బాధ్యతలు ద్రవిడ్ నిర్వహించకూడదన్నది బీసీసీఐ నియమం. ఇందుకోసం ద్రవిడ్ దిల్లీని వదులుకోగా... అందుకు తగ్గ పారితోషకాన్ని బీసీసీఐ ద్రవిడ్‌కి అందజేస్తోంది.

రెండు సంవత్సరాల ఒప్పందానికి ద్రవిడ్‌కి బీసీసీఐ సుమారు రూ.10కోట్లు అందజేయనుంది.


# కార్తి చిదంబరం కేసులో ఈడీకి సుప్రీంకోర్టు షాక్

న్యూఢిల్లీ : కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఆయనపై మనీలాండరింగ్ నిరోధక చట్టం క్రింద ఈడీ దాఖలు చేసిన కేసులో ముందస్తు విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది.

కార్తి చిదంబరం వాదనను వినేందుకు మద్రాస్ హైకోర్టుకు అధికార పరిధి ఉందా? అని ఈడీ సుప్రీంకోర్టును అడిగింది. ఈడీ సమన్లను కార్తి మద్రాస్ హైకోర్టులో సవాలు చేశారు. గత నెలలో చెన్నై లోని కార్తి నివాసంపై ఆదాయపు పన్ను శాఖ దాడుల నేపథ్యంలో కార్తి, తదితరులపై ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసింది.

సీబీఐ ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈ కేసు దాఖలు చేసింది. పి. చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో మారిషస్ నుంచి నిధులను స్వీకరించినందుకు కార్తి చిదంబరంపై సీబీఐ కేసు నమోదు చేసింది.

# కోచ్ రేసులో రవిశాస్త్రినే ముందున్నాడు



దిల్లీ: భారత జట్టు ప్రధాన కోచ్ పదవి రేసులో రవిశాస్త్రి ముందున్నాడని భారత జట్టు మాజీ సారథి సునీల్ గవాస్కర్ తెలిపారు. ఓ అంతర్జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో గవాస్కర్ మాట్లాడుతూ.. భారత జట్టు ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తు చేసిన వారందరిలో రవిశాస్త్రి ముందున్నాడని చెప్పారు. టీమ్ ఇండియా కోచ్ పదవికి రవిశాస్త్రి దరఖాస్తు చేసినట్లు ఓ బీసీసీఐ అధికారి తాజాగా ధ్రువీకరించిన విషయం తెలిసిందే.

గంగూలీ, సచిన్, లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా మండలి(సీఏసీ) జులై 10న ముంబయిలో ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. ఎవరిని ఎంచుకుంటే జట్టంతా సౌకర్యవంతంగా ఫీలవుతుందో... అతనికే సీఏసీ కోచ్ పదవిని కట్టబెడతోందని గవాస్కర్ తెలిపారు. 2014 ఆగస్టు నుంచి 2016 జూన్ వరకు శాస్త్రి టీమిండియా డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే భారత్ 22 ఏళ్ల తర్వాత శ్రీలంకపై టెస్టు సిరీస్ గెలిచింది. అనంతరం దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌ను భారత్ చేజిక్కించుకుందని గవాస్కర్ తెలిపారు. సెహ్వాగ్, టామ్ మూడీ దరఖాస్తు చేసినప్పటికీ వారిద్దరి కంటే రవిశాస్త్రికే అనుభవం ఎక్కువ ఉందని, గతంలోనూ జట్టుతో కలిసి ఉన్నాడని అన్నారు.

అనంతరం వెస్టిండీస్ పర్యటనలో ఉన్న టీమిండియా గురించి గవాస్కర్ మాట్లాడుతూ.. భారత్-వెస్టిండీస్ మధ్య నాలుగో వన్డేలో ధోనీ నెమ్మదిగా సాధించిన అర్ధశతకం వల్లే భారత్ ఓడిపోయిందనేదే ముఖ్య కారణం కాదు అని, పలు కారణాల్లో అది ఒకటి మాత్రమే అని, ధోనీపై అనవసర వ్యాఖ్యలు చేయవద్దని, జట్టంతా బ్యాటింగ్‌లో వైఫల్యం చెందడం వల్లే ఓడిపోయిందని గవాస్కర్ చెప్పారు.





*కంచెరపాలెంలో ఇందిరానగర్-5లో అల్లూరి సీతారామరాజు కాలనీలో అల్లూరిసీతారామరాజు 120వ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చొక్కాకుల వెంకటరావు, సిహెచ్. రామకృష్ణ, పి. విజయ, పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.*

# జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో ఆందోళన

న్యూదిల్లీ: వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) బిల్లుపై చర్చ సందర్భంగా జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. జీఎస్‌టీ బిల్లును వ్యతిరేకిస్తూ నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారు. ఈ బిల్లు వల్ల జమ్ముకశ్మీర్ ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆందోళన కారణంగా సభా కార్యక్రమాలు మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి. స్వతంత్ర ఎమ్మెల్యే రషీద్‌ను మార్షల్స్ అసెంబ్లీ బయటకు తరలించారు.

దేశవ్యాప్తంగా జీఎస్‌టీ అమల్లోకి రాగా.. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ మాత్రం ఇంకా ఈ బిల్లుకు ఆమోదం తెలపలేదు. దీంతో జీఎస్‌టీ బిల్లుకు జులై 6లోగా ఆమోదముద్ర వేయాలని పాలక పక్షం యోచిస్తోంది. మరోవె%పు సభలో ఎన్సీపీ, కాంగ్రెస్ సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తుండగా.. బయట పలు వర్తక సంఘాలు ఒక సమన్వయ కమిటీగా ఏర్పడి ఆందోళన చేస్తున్నారు.

# దూసుకొచ్చిన చైనా యుద్ధనౌకలు

### హిందూ మహా సముద్రంలో చక్కర్లు



న్యూఢిల్లీ: ఒకవైపు సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణాత్మక వాతావరణం.. మరోవైపు భారత్-చైనా మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో చైనా యుద్ధనౌకలు హిందూ మహా సముద్రంలో చక్కర్లు కొడుతుండటం కలకలం రేపుతోంది. చైనీస్ యుద్ధనౌకలు అనూహ్యరీతిలో భారత్‌కు ఆనుకొని ఉన్న హిందూమహాసముద్రంలో సంచరిస్తుండటం గమనార్హం. సిక్కిం సరిహద్దుల్లో నెలరోజు లుగా ఇరుదేశాల ఆర్మీ మధ్య ఘర్షణలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే.






## దేశం కోసం ప్రాణం త్యాగం చేసిన

# మహనీయుడు అల్లూరి సీతారామరాజు



గాజువాక: భారత మాత ముద్దు బిడ్డ, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు, స్వాతంత్ర్యసమర యోధుడు అల్లూరి సీతారామరాజు అని భాజపా విశాఖ నగర శాఖ నగరాధ్యక్షులు నాగేంద్ర పేర్కొన్నారు. మంగళవారం నాగేంద్ర ఆద్వర్యంలో మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా బీచ్ ఒడ్డున ఉన్న మహనీయుడు అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారత మాత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహెూజ్వల శక్తిఅని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంమని నాగేంద్ర కొనియాడారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్ర్యం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. కేవలం 27ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు ఆయన అనుచరులతో, పరిమిత వనరులతో బ్రీటీషు సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అసమాన యోధుడు అని అన్నారు. అల్లూరి సీతారామరాజు చరిత్ర పుటల్లో అజరామరుడిగా నిలిచిపోతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేంద్రప్రకాష్, ప్రకాష్‌రెడ్డి, కాశీ విశ్వనాధరాజు, కొల్లిరత్నకుమారి, విశాఖ నగర బీజేపీ నాయకులు అప్పలకొండ యాదవ్, దుర్గరాజు, జీసీ నాయుడు, నగర మహిళామోర్చా అధ్యక్షురాలు జి.ప్రేమకుమారి, యువమోర్చా రాష్ట్ర నాయకులు సురేంద్రమోహన్, అడారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com